ప్రజావీక్షణం దినపత్రిక
విలేకర్లు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో
ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ
ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా.?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా.?
అయితే రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా
జిల్లాలు, మండలాల వారీగా నిబద్ధతతో
పని చేసే విలేకరులు కావలెను
PJV ప్రజా వీక్షణం టీవి
9866330400


# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్


PJV ప్రజా వీక్షణం టీవి
Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :206 20 శనివారం, జూన్ 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

## మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం

## గ్రీన్ సిగ్నల్





హైదరాబాద్,జూన్19 (ప్రజా వీక్షణం)

తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది.

మిగతా 2 లో

- అనుమతులు ఇస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ
- రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి అప్పగింత
- అనుమతులపై సిఎం రేవంత్ రెడ్డి హర్షం
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కృతజ్ఞతలు

## సింగరేణిపై బిజెపి చిల్లర రాజకీయాలు

- అక్కడ పర్యటించే హక్కు ఆ నేతలకు లేదు
- ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శలు



హైదరాబాద్,జూన్19 (ప్రజా వీక్షణం)

సింగరేణిపై బీజేపీ ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. సింగరేణి సంస్థపై మాట్లాడే నైతిక అర్హత గానీ, అక్కడ పర్యటించే హక్కు గానీ బీజేపీకి ఎంతమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీ ఆకాంక్షించిన విధంగా నవ భారత నిర్మాణం జరగాల్సి ఉంది




- మహేశ్ గౌడ్

- రాహుల్ జన్మదినం సందర్భంగా గాంధీ భవన్ లో కేక్ కట్ చేసిన మహేశ్ గౌడ్- కార్పొరేట్ పెత్తందారుల కోసమే బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందని విమర్శ

(ప్రజా వీక్షణం)

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నాంపల్లిలోని కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం 'గాంధీ భవన్'లో వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ భారీ కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాంధీ భవన్ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

## అట్టహాసంగా యంగ్ ఇండియా వెల్‌కమ్ కిట్ల పంపిణీ

- విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించిన గవర్నర్- వివిధ ప్రాంతాల నుంచి 15వేలమంది విద్యార్థుల హాజరు- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనుల, ప్రారంభోత్సవాలు

హైదరాబాద్,జూన్19 (ప్రజా వీక్షణం)

ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా వెల్కమ్ కిట్స్ పంపిణీ, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది.

వివరాలు 2లో




## పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

- నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు
- తెలంగాణలో విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి- విద్యార్థులకు యంగ్ ఇండియా స్కూల్ కిట్స్ అందచేత- విద్యామంత్రిగా తానే నిరంతర పర్యవేక్షణ- సఎల్బీ స్టేడియం కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

2 లో

## ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్



- మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి
- కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు
- మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్,జూన్19 (ప్రజా వీక్షణం)

రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు.

వివరాలు 2లో

## నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

- రూ.3,125 కోట్లు పంపిణీకి రంగం సిద్ధం
- 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ది
- లింగంగుట్లలో అందచేయనున్న సిఎం చంద్రబాబు

అమరావతి,జూన్19 (ప్రజా వీక్షణం)



రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు అన్నదాత సుఖీభవ నిధులను ఎపి ప్రభుత్వం నేడు విడుదల చేయనుంది. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగం గుంట్లలో జరిగే కార్యక్రమంలో ఈ నిధులను సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేయనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో తొలి విడత నగదును అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ ద్వారా ఈ ఏడాది తొలి విడతగా రూ.3,125 కోట్లు పంపిణీ చేయనున్నారు.

## కేంద్రం నిర్ణయం మేరకే కొంటే మీరెందుకు ?

- కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక విశ్వాస ఘాతక ప్రభుత్వం
- రాహుల్ జన్మదినం రోజే రైతు డిక్లరేషన్‌కు చెల్లుచీటీ
- రైతులపై విషం కక్కిన సిఎం రేవంత్ రెడ్డి
- రెండు బస్తాల యూరియాతో మిర్చి రైతులు ఏం కాను
- మీడియా సమావేశంలో ప్రభుత్వంపై హరీష్ విమర్శలు

సిద్దిపేట,జూన్19 (ప్రజా వీక్షణం)

కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు.



## సింగరేణి సమస్యలు పరిష్కరించాలి




- నాణ్యమైన యంత్రాలను సమకూర్చాలి
- బాయిబాట కార్యక్రమానికి శ్రీధర్ బాబు ఆటంకాలు
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు

పెద్దపల్లి,జూన్19 (ప్రజా వీక్షణం)

'బాయి బాట' కార్యక్రమం చేపడితే రాజకీయంగా తమను అడ్డుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు పోలీసులను ఏర్పాటు చేశారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆరోపించారు.ఎంత అడ్డుకుంటే అంత బలంగా ముందుకు సాగుతామన్నారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును కవిత సందర్శించారు. కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

## మెకెదాటు డ్యామ్ నిర్మాణం కుదరదు

- కావేరి డెల్టా రైతులకు తీరని నష్టం
- కర్నాటక తీరుకు నిరసనగా తమిళ అసెంబ్లీలో తీర్మానం

చెన్నై,జూన్19 (ప్రజా వీక్షణం)

కర్ణాటక ప్రభుత్వం కావేరీ నదిపై మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలను తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకించింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. డ్యామ్ నిర్మాణంతో కావేరి డెల్టా రైతులకు తీవ్రనష్టం కలుగుతుందని తమిళనాడు ప్రభుత్వం ఆరోపిస్తోంది.

వివరాలు 2లో



ప్రజావీక్షణం దినపత్రిక
ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

# సంపాదకీయం

## సమగ్ర పంటల విధానమే మేలు !

దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతులెత్తేస్తున్నాయి. ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది. డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు. అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి.ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరపున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రం తన కోటా మేరకు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తే రైతులు ఏం కావాలన్నది ఆలోచన చేయాలి. అందువల్ల పంటల విధానం అమల్లోకి రావాలి. ఏయే పంటలు వేయాలో, ఎంత విస్తీర్ణంలో వేయాలో ప్రభుత్వం నిర్ణయించాలి. అందుకు తగ్గట్లుగా ఎరువుల,విత్తనాలు సరఫరాచేసి, ఆయా పంటలనే ప్రోత్సహించడం ద్వారా సంక్షోభాన్ని అధిగమించవచ్చు.

# పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,జూన్19 (ప్రజా వీక్షణం)

దేశ బవిష్యత్ పాఠశాలల్లోనే ఉందని గ్రహించి, అందుకు అనుగుణంగా తెలంగాణ విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. పేదలు ఆత్మన్యూన తకు లోనుకకాకుండా వారి పిల్లలకు కూడా ప్రైవేట్ తరహా విద్యను అందిస్తున్నామని అన్నారు. అందుకోసం విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. అందుకోసం విద్యాశాఖను తానే స్వయంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదని ఈసందర్భంగా అన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలన్నదే తన సంకల్పమని అన్నారు. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం అని వివరించారు. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ఈ ఛార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# అట్టహాసంగా యంగ్ ఇండియా వెల్‌కమ్ కిట్ల పంపిణీ

మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించడంతో పాటు కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా రూ.50.73కోట్లతో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సీఎం రేవంత్ శ్రీకారం చుట్టారు. అందులో రూ.36.65కోట్లతో వివిధ జిల్లాల్లో మినీ స్టేడియాల నిర్మాణం, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. రూ.14.08కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియాల్లో బాలబాలికల క్రీడా శిక్షణకు వివిధ అకాడమీలను రేవంత్ ప్రారంభించారు. రూ.10కోట్లతో రంగారెడ్డి జిల్లా కొందుర్గ్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.10కోట్లతో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం ఆధునికీకరణకు కొబ్బరికాయ కొట్టారు. అలాగే రూ.4కోట్లతో నారాయణపేట్ జిల్లా నర్వలో మినీ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.4కోట్లతో వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో మల్టీ పర్పస్ స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టుల నిర్మాణం, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.3.50కోట్లతో కామారెడ్డి జిల్లా గాంధారి, రూ.2.65కోట్లతో మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మినీ స్టేడియాలకు భూమిపూజ చేశారు. రూ.2.50కోట్లతో నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం ఉట్కూరులో వాలీబాల్, కబడ్డీ కోర్టుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు సీఎం రేవంత్. రూ.5.70 కోట్లతో బాలికల కోసం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎంఈం తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.5.70 కోట్లతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈఎంఈం తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభించారు. రూ.35.95 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం అయ్యింది. రూ.35.94 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.44.50 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం అయ్యింది. రూ.58.50 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్ బాల్ అకాడమీ ప్రారంభం చేశారు. రూ.49 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాల్ అకాడమీ ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. మరోవైపు గురుకుల విద్యార్థులకు 22 రకాల వస్తువులు, హాస్టల్ విద్యార్థులకు 10, డే స్కాలర్లకు 7 రకాల విద్యా సామగ్రితో కిట్లను అందించారు. ఈ కార్యక్రమానికి సుమారు 15వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ చారిత్రాత్మక వేడుకకు రాష్ట్రంలోని ప్రభుత్వ బడులు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు), ప్రభుత్వ గురుకులాలు, విద్యా వసతి గృహాల నుంచి దాదాపు 15 వేల మంది విద్యార్థులు తరలివచ్చారు. విద్యార్థులు చదువుకునే విద్యాసంస్థల రకాన్ని బట్టి వారి అవసరాలకు తగినట్లుగా ఈ కిట్లను ప్రభుత్వం ప్రత్యేకంగా డిజైన్ చేసింది.

# మూసీ రివర్‌ఫ్రంట్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుండి కీలక అనుమతులు లభించాయి. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులకు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కీలకమైన క్లియరెన్స్ లభించడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో సహకరించి, అనుమతులు మంజూరు చేసినందుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణ శాఖ , ఇండియన్ ఆర్మీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవనం , రివర్‌ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు అనుమతులు రావడం ఒక కీలక మైలురాయి అని అభివర్ణించారు. బాపు ఘాట్ పరిసర ప్రాంతాలలో ఈ ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కావడం వల్ల మూసీ పరివాహక ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని కేవలం ఒక నదిలా కాకుండా.. అద్భుతమైన పర్యావరణ, సాంస్కృతిక , గొప్ప ప్రజా ఆస్తిగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్ నగరానికి ఒక సరికొత్త పర్యాటక హంగులు తోడవుతాయని, పర్యావరణ రక్షణకు కూడా ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర రక్షణ శాఖ ఇచ్చిన ఈ గ్రీన్ సిగ్నల్‌తో గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి విజన్‌లో ఇదో మైలురాయన్నారు. మూసీ పరివాహక ప్రాంతాన్ని పర్యావరణ, సాంస్కృతిక, ప్రజా ఆస్తిగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# మెకెదాటు డ్యామ్ నిర్మాణం కుదరదు

మొదటిపేజీ తరువాయి

గత నెలలో తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన సందర్భంగా మేకెదాటు వద్ద డ్యామ్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి పత్రం సమర్పించారు. కావేరి నిర్వాహక మండలిలో సభ్యులుగా ఉన్న రాష్ట్రాల ఆమోదం లేకుండా మేకెదాటు ప్రాజెక్టును చేపట్టడానికి వీలులేదని, ఈ విషయమై కేంద్ర జలశక్తి శాఖకు, కేంద్ర నీటి వనరులకు శాఖకు ఆదేశాలివ్వాలని మోదీని కోరారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య వివాదానికి దారి తీసిన మేకెదాటు ప్రాజెక్ట్‌పై తమిళనాడు అసెంబ్లీలో కీలక తీర్మానం జరిగింది. మేకెదాటు డ్యామ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కర్ణాటక ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్ట్ కావేరి నదీ జలాల వివాదాల ట్రిబ్యునల్ తుది అవార్డుతో పాటు.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పర్యావరణ, సాంకేతిక అనుమతులు ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

# ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. దీనిపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారు. వంద రోజుల్లో పిల్లలు పుడతారా అంటూ వింత మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే చాలు, పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షయంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి ప్రజలు , బిఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి రౌడీలు, గుండాలకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పరంగా నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

మొదటిపేజీ తరువాయి

ఈ నగదు ద్వారా 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. మరో వైపు శనివారం ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద నిధులను విడుదల చేస్తోంది. పశ్చిమ బెంగాల్ హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, ఏపీ ప్రభుత్వం ఒకే రోజు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి.ఇంకో వైపు జూన్ 30వ తేదీన రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు.

# ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డికి ఘన స్వాగతం

## - ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో సత్కారం

## - గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పాఠశాల సమస్యలపై సుదీర్ఘ చర్చ







**పోలవరం, జూన్ 19 (ప్రజా వీక్షణం):**

ఏలూరు జిల్లా పోలవరం నియోజక వర్గంలో ఒక రోజు పర్యటన నిమిత్తం శుక్రవారం స్థానిక ఐటిడిఏ అతిథి గృహానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ పోళ్ళ బొజ్జి రెడ్డికి ఘన స్వాగతం లభించింది. పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఐటిడిఏ అతిథి గృహంలో అల్పాహార విందు ముగిసిన తర్వాత నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధి, గిరిజన విద్య, సంక్షేమ కార్యక్రమాలు మరియు స్థానిక ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే, చైర్మన్ సుదీర్ఘంగా చర్చించారు. అక్కడి నుండి వారు నేరుగా బుట్టాయిగూడెం మండలం పులి రామన్నగూడెం గ్రామానికి చేరుకున్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తరగతుల సంఖ్యను తగ్గించడంపై గత కొన్ని రోజులుగా తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, తరగతులను యథావిధిగా కొనసాగించేలా సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఎస్టీ కమిషన్ సభ్యులు కాకి లక్ష్మి, గొర్లె సునీత, ఐటిడిఏ పీవో రాముల నాయక్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టిసీమలో ఘనంగా 'యోగాంధ్ర'..

## - పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు








**పట్టిసీమ (పోలవరం):జూన్ 19(ప్రజా వీక్షణం)**

శారీరక, మానసిక వికాసానికి యోగా ఎంతో దోహదపడుతుందని, నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని పోలవరం శాసన సభ్యులు చిర్రి బాలరాజు పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "యోగాంధ్ర" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ గ్రామంలో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ముఖ్య అతిథిగా హాజరై, స్థానికులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది భారతీయ ప్రాచీన జీవన విధానమని కొనియాడారు. నిత్యం యోగా సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేందుకు ఈ 'యోగాంధ్ర' వంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయాన్ని యోగాకు కేటాయించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, కూటమి ముఖ్య నేతలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో:జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఆర్డీఓ రమణ, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ కే. స్లీవ్ జోజి. అలాగే రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, కూటమి నాయకులు కరిబండి నాగరాజు, బొరగం వెంకటలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ మామిడిపల్లి స్వాతి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కరిబండి గణిరాజు, కాకి అయ్యప్ప, చీకట్ల సాయి, సిద్ధన రామకృష్ణ, సొసైటీ నులకాని రాంబాబు తదితరులు ఉన్నారు.

# ద్వారకాతిరుమల లాడ్జిలో పేకాట రాకెట్ రట్టు

## - మీడియా ప్రతినిధులు, దేవస్థానం ఉద్యోగులతో సహా 10 మంది అరెస్ట్!



**ద్వారకాతిరుమల, జూన్ 19:(ప్రజా వీక్షణం)**

పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని ఒక ప్రైవేటు లాడ్జి వేదికగా సాగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ అందిన రహస్య సమాచారంతో జారీ చేసిన ఆదేశాల మేరకు బుధవారం రాత్రి ఈ దాడి జరిగింది. భీముడోలు సీఐ కృష్ణ నేతృత్వంలో పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించి, పేకాటాడుతున్న 10 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుల్లో ప్రముఖులు..పోలీసుల దాడిలో పట్టుబడిన వారిలో ఇద్దరు ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు, మరో ఇద్దరు ద్వారకాతిరుమల దేవస్థాన ఉద్యోగులు ఉండటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. మిగిలిన ఆరుగురు వివిధ ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. నిందితుల నుంచి పోలీసులు ఏడు సెల్ ఫోన్లను, రూ. 20,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. ద్వారకాతిరుమల సబ్ ఇన్స్పెక్టర్ టి. సుధీర్ ఇచ్చిన అధికారిక ఫిర్యాదు మేరకు పట్టుబడిన పదిమంది వ్యక్తులపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పుణ్యక్షేత్రాల పరిధిలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని పోలీసులు హెచ్చరించారు. ఈ పేకాట శిబిరం వెనుక ద్వారకా తిరుమల పోలీస్ స్టేషన్‌లోనే విధులు నిర్వహిస్తున్న ఒక కానిస్టేబుల్ హస్తం కూడా ఉన్నట్లు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం సాగుతోంది. సదరు కానిస్టేబుల్ అండదండలతోనే సురక్షితంగా ఈ నిర్వహణ సాగిందా అనే కోణంలోనూ, అంతర్గత విచారణ జరుగుతున్నట్లు సమాచారం. ఈ ప్రచారం స్థానిక పోలీస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# మున్సిపాలిటీలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మట్ పర్యటన

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 19 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మట్ శుక్రవారం కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించి వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లు, ప్రజా సేవల అమలుపై అధికారులతో చర్చించి తగు సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి షహీన్ సుల్తానా గారు, వార్డు కౌన్సిలర్లతో కలిసి పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తదుపరి ఎల్లగౌడ్ తోట పార్క్ ను సందర్శించి పార్కులో చేపట్టిన అభివృద్ధి పనులు, పరిశుభ్రత, పచ్చదనం, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. పార్కు నిర్వహణను మరింత మెరుగుపరచడంతో పాటు పచ్చదన పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.బి. రామాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. శంకర్, పర్యావరణ ఇంజనీర్ డి. ప్రణీల్ కుమార్, ఇతర శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**దేవరకద్ర జూన్ 19 ప్రజా విక్షణం**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని శుక్రవారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకద్ర మున్సిపాలిటీ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి వారి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ దగ్గర మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల తో కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఫరూక్అలీ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ ఐ ఆర్ ను పకడ్బందీగా చేపట్టాలి..

## జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**దేవరకద్ర జూన్ 19 ప్రజా వి క్షణం**

ఎస్ ఐ ఆర్ ను ప్రత్యేక సమగ్ర సవరణను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అదనపు మధుసూదన్ నాయక్ కోరారు . శుక్రవారం దేవరకథ మున్సిపాలిటీ కేంద్రంలో స్థానిక రైతు వేదిక భవనం వద్దా స్థానికతాసిల్దార్ ఎండి హర్షద్ ఆధ్వర్యంలో సమావేశాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో నమూలంగా మార్పులుతీసుకురావాలన్నారు. ఆకాంక్షలతో రాష్ట్ర ఎన్నికల సంఘం సర్ అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు బిఎల్ఓ లకు వివరించారు. గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ గణన పత్రాలు ఇవ్వాలన్నారు. ఆ పత్రాలను పూర్తిచేసిన పిదప ఒక సెట్టు ఒక ఓటర్లకు మరో సెట్ మీరు తీసుకొని తప్పులు లేకుండా డాటాను అప్లోడ్ చేయాలన్నారు. ఏదైనా అనుమానం వస్తే సూపర్వైజర్లు లేదా బూత్ స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయాలన్నారు. గతంలో మాదిరిగా నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తాసిల్దార్ దీపిక. ఆర్ఐలు శరత్ నాయక్, సహాత్, శశికళ, జి పి ఓ లు రాజు వెంకట్ రాములు నాగేష్ నరేష్ రమేష్ సత్తి. బి ఎల్ వో లు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.





ప్రజావీక్షణం
దినపత్రిక

# కస్తూరిబా గాంధీ పాఠశాల ను సందర్శించిన జి సి డి ఓ

దేవరకద్ర జూన్ 19 ప్రజా విక్షణం

దేవరకద్ర మండల పరిధిలోని డోకూరు గ్రామ శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం ను అస్రా ఖాద్రి.జి సి డి ఓ శుక్రవారం సందర్శించారు. పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న వసతి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. పాఠశాలలోని వంటగది తరగతి గదులు. స్నానపు గదులు.పరిసరాలను పరిశీలించినారు విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని ఉన్నత స్థానానికి ఎదగాలని పాఠశాలకు వచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలని కోరినారు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ఉచిత పుస్తకాలు ఉచిత నోటు పుస్తకాలు దుప్పట్లు బెడ్డింగ్ మెటీరియల్ విద్యార్థులకు అందజేసినారు. ప్రభుత్వం ద్వారా కస్తూర్బా గాంధీ విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనము అందిస్తున్నామని. ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా కస్తూర్బా ఏఎన్ఎం.హెల్త్ కమాండ్ సెంటర్ మరియు స్థానిక ఆసుపత్రి ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని. అన్ని డిపార్ట్మెంట్ల సమన్వయంతో సమన్వయంతో విద్యార్థులకు సేఫ్టీ సెక్యూరిటీ భద్రతను కలిగిస్తున్నామని చెప్పినారు. గత సంవత్సరం లాగానే విద్యార్థులకు కరాటే నేర్పిస్తామని తెలిపినారు. పాఠశాలలో ఒకేషనల్ ఎడ్యుకేషన్ మరియు డిజిటల్ లెర్నింగ్ ద్వారా ఖాన్ అకాడమీ. ఫిజిక్ వాలా. విద్యార్థులను డిజిటల్ క్లాసులు అందిస్తున్నామని తెలిపారు.







# ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే సోదరుడు

దేవరకద్ర జూన్ 19 ప్రజా విక్షణం

మండల పరిధిలోని చిన్నరాజమూరు గ్రామంలో శుక్రవారం రాజమోని శ్రీనివాస్ ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సోదరుడు జి. భాస్కర్ రెడ్డి అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు తమ కుటుంబం తరపున కొత్త బట్టలు పెట్టిన నూతన వస్త్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హనుమంతు. మండల పార్టీ అధ్యక్షుడు అంజిల్ రెడ్డి. మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన పిల్లల చదువులతో చెలగాటమాడొద్దు!

## - ఆశ్రమ పాఠశాలల్లో పాత పద్ధతిలోనే తరగతులు కొనసాగించాలి
## - రేషనలైజేషన్ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలి
## - ఎస్.టి. కమిషన్ చైర్మన్‌కు ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం వినతి

బుట్టాయగూడెం, జూన్ 19 (ప్రజా వీక్షణం):

జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో రేషనలైజేషన్ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేసి, గతంలో ఉన్న విధంగానే పాత పద్ధతిలోనే తరగతులను కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని దొరమామిడి గ్రామంలో పర్యటించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్.టి. కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. రేషనలైజేషన్ వల్ల గిరిజన విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించి, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉప సంహరించుకునేలా ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ ఒక వినతిపత్రాన్ని అందజేశారు. "రేషనలైజేషన్ పేరుతో ఏలూరు జిల్లాలోని 21 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 3, 4 తరగతులను, మరో 4 పాఠశాలల్లో 8, 9, 10 తరగతులను కుదించడం గిరిజన విద్యపై జరిగిన తీవ్రమైన దెబ్బ." అని కారం భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి అన్నారు. ఈ సందర్భంగా కారం భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయం వల్ల చిన్నారి విద్యార్థులు చదువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడం, కుటుంబాల ఆర్థిక పరిస్థితులు, భౌగోళిక ఇబ్బందుల వల్ల పిల్లలు దూర ప్రాంతాలకు వెళ్లలేక మధ్యలోనే చదువు మానేసే (డ్రాప్‌అవుట్స్) ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే విద్యాభ్యాసం కష్టంగా ఉన్న తరుణంలో, ప్రభుత్వ చర్యలు గిరిజన పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా ఉన్నాయని మండిపడ్డారు. గిరిజన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, కానీ తరగతుల



కుదింపు ద్వారా వారి విద్యా హక్కును కాలరాస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సింది పోయి, నిర్వీర్యం చేసే చర్యలను వెంటనే నిలిపివేయాలన్నారు. గిరిజన విద్యార్థుల విద్యా వికాసానికి పాత విధానాన్నే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్.టి. కమిషన్ చైర్మన్ హామీగిరిజన సంఘాల నేతలు సమర్పించిన వినతిపై ఎస్.టి. కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆశ్రమ పాఠశాలల్లో రేషనలైజేషన్ వల్ల ఎదురవుతున్న సమస్యలపై సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తానని, గిరిజన విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# భవిష్యత్తు ఎన్డీఏ మిత్ర పక్షాలదే

## - మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పూర్తి సహకారం అందిస్తోంది
## - ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబు సఫలం
## - తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి)








తాడేపల్లిగూడెం ప్రతినిధి జూన్ 19 (ప్రజా వీక్షణం)

భవిష్యత్తు ఎన్డీఏ మిత్ర పక్షాలదేనని, మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పూర్తి సహకారం అందిస్తుందని తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డ్ చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా భీమవరంలో నిర్వహిస్తున్న విజయోత్సవ సభకు బాబ్జి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు శుక్రవారం భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మనవల మల్లికార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సఫలీకృతులయ్యారని చెప్పారు. గత వైసీపి ప్రభుత్వం సంపూర్ణ మద్యపాన నిషేధం, డిఎస్సీ నిర్వహణ వంటి హామీలనిచ్చి ఐదేళ్లలో అమలు చేయలేకపోవటం సిగ్గుచేటని విమర్శించారు. మద్యం అమ్మకాలు, రవాణాకు సంబంధించి పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. పోలవరం, వెలుగొండ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. యువనేత, ఐటి శాఖ మంత్రి లోకేష్ రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకొస్తూ ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నారని కొనియాడారు. వైకాపా ప్రభుత్వంలో అమ్మ ఒడి పేరుతో ఒక విద్యార్థికి మాత్రమే ఆర్థిక సాయం అందించే వారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా ఒక్కొక్కరికి రూ 15 వేలు చొప్పున ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ప్రశంసించారు. పింఛన్ల విషయంలో గత వైసీపి ప్రభుత్వం ఐదేళ్లలో రూ 2 వేలు నుంచి రూ 3 వేలుకు పెంచితే కూటమి ప్రభుత్వం అధికారం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ రూ 4 వేలుకు పెంచి తన చిత్తశుద్ధిని నిరూపించుకుందని తెలిపారు. ఉచిత బస్సు పథకం ద్వారా మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. 2000 ఏసీ బస్సులకు ఆర్డర్లు ఇచ్చారని, ఎలక్ట్రికల్ బస్సులు త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి అత్యధిక నిధులు తీసుకొచ్చి గత వైకాపా ప్రభుత్వ హయాంలో తూట్లు పడిన రహదారులు, పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. గత వైకాపా ప్రభుత్వం చేసిన అప్పులపై వడ్డీలు, కిస్తీలు చెల్లిస్తూనే కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తుందని తెలిపారు. గతంలో కేవలం బటన్ నొక్కి అభివృద్ధిని గాలికి వదిలేసారని, కానీ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్ళుగా భావిస్తూ ముందుకెళుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి భవిష్యత్ నాయకుడు లోకేష్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆకాశపు స్వామి, పట్నాల రాంపండు, ముత్యాల వీర వెంకట సత్యనారాయణ, బడుగు వెంకటేశ్వరరావు, దాట్ల జగన్నాథరాజు, వట్టూరి రాంబాబు, రఘు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం: -బాధితులకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని తక్షణ సహాయం





దెందులూరు జూన్ 19(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా మండల కేంద్రమైన దెందులూరులోని కాశీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ తక్షణమే స్పందించి అండగా నిలిచారు.ఘటనా వివరాలు ప్రకారం..కాశీ కాలనీకి చెందిన వృద్ధురాలు తోట సోమమ్మ (75), ఆమె కుమార్తె చుక్కా రమణ నివసిస్తున్న రేకుల షెడ్‌లో శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. క్షణాల వ్యవధిలోనే మంటలు వ్యాపించడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో బాధితులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూశారు.బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ ఆర్థిక సాయం:ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితులను పరామర్శించి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, తానున్నానంటూ బాధితులకు భరోసా ఇచ్చారు. తన వంతు తక్షణ సహాయంగా రూ.10,000 నగదును బాధితులకు అందజేశారు. దీనితో పాటు ప్రభుత్వం తరఫున 50 కేజీల బియ్యాన్ని, తన సొంత ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువుల కిట్టును కూడా వారికి పంపిణీ చేశారు. ఆపద సమయంలో తమకు తక్షణమే స్పందించి అండగా నిలిచిన ఎమ్మెల్యే చింతమనేనికి బాధితులు కన్నీటి పర్యంతమై కృతజ్ఞతలు తెలిపారు.ఈ పరామర్శ కార్యక్రమంలో దెందులూరు సహకార సొసైటీ చైర్మన్ గారపాటి కొండయ్య చౌదరి, తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి నాని, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, దెందులూరు గ్రామ పార్టీ అధ్యక్షులు ఇప్పిలి వెంకటేశ్వరరావు, జిల్లా టీడీపీ కమిటీ సభ్యులు తిలక్, దెందులూరు ఎమ్మార్వో బత్తిన సుమతితో పాటు పలువురు కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష కేంద్రం వద్ద నిషేధాజ్ఞలు అమలు పటిష్ట పోలీసు బందోబస్తు

## - పరీక్షల నిర్వహణ సజావుగా జరిగేందుకు 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు జిల్లా ఎస్పీ నితికా పంత్..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 19 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా నీట్ (చీజుజు) ప్రవేశ పరీక్షను ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రంగా ఉన్న జనకాపూర్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల బాలుర జూనియర్ కళాశాల ( జిల్లా అటవీ కార్యాలయం ఎదురుగా ) వద్ద శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సెక్షన్ 163 బి ఎన్ యస్ యస్ (144 సెక్షన్) అమలు చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్షార్థులను కేంద్రం లోకి అనుమతిస్తారని, మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. పరీక్ష సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని ఎస్పీ స్పష్టం చేశారు. అమలు చేయబడిన నిషేధాజ్ఞల ప్రకారం:
పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు పూర్తిగా నిషేధం. పరీక్ష కేంద్రం నుండి 500 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు 21-06-2026 ఉదయం 06:00 గంటల నుండి సాయంత్రం 07:00 గంటల వరకు మూసి వేయాలి. ఈ ఉత్తర్వులను ఎవరైనా అతిక్రమించిన పక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఎస్పీ తెలిపారు.



# మానవ హక్కుల ఆర్గనైజేషన్ జాతీయ కార్యాలయంలో మహిళల అర్జీలు ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

**అవనిగడ్డ జూన్ 19: (ప్రజా వీక్షణం)**

అవనిగడ్డ మండలానికి చెందిన పలువురు మహిళలు శుక్రవారం మానవ హక్కుల ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా జాతీయ కార్యాలయాన్ని సందర్శించారు. తమ ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తూ వారు అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రతినిధులు మహిళల సమస్యలను సావధానంగా విని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమస్యల విన్నపం అనంతరం, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఆరోగ్య పథకమైన 'ఆయుష్మాన్ భారత్' గురించి మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం అక్కడికక్కడే మహిళల వివరాలను ఆన్‌లైన్ చేసి, వారికి ఆయుష్మాన్ కార్డులను మంజూరు చేశారు. అంతేకాకుండా, ఈ కార్డులు ఏ ఏ ఆసుపత్రుల్లో చెల్లుబాటు అవుతాయో తెలియజేసే హాస్పిటల్స్ లిస్ట్ (ఆసుపత్రుల జాబితా)ను కూడా మహిళలకు అందజేశారు. తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి, ఉచితంగా ఆయుష్మాన్ కార్డులను అందజేయడమే కాకుండా ఆసుపత్రుల వివరాలను తెలియజేసినందుకు గాను డాక్టర్ అమ్మిరెడ్డి రజనికి మహిళలు ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు.




# గోమాతకు ప్రత్యేక పూజలు

**దేవరకద్ర జూన్ 19 ప్రజా విక్షణం**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో స్థానిక ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో శుక్రవారం అర్చకులు గోమాతకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గోమాతకు పూజలు చేయడం వల్ల సకల దేవతలకు పూజలు చేసినట్లు అవుతుందని అర్చకులు తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా గోమాతకు పూజలు చేయాలని అలా చేయడం వల్ల ఫలితాలు లభిస్తాయని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నాగభూషణం. నాగరాజు. తదితరులు పాల్గొన్నారు.



# నాగారంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**దేవరకద్ర జూన్ 19 ప్రజావి క్షణం**

మండల పరిధిలోని నాగారం గ్రామంలో శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భావిభారత ప్రధాని రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూనేటి అంజల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అంజల్ రెడ్డి, మాట్లాడుతూ రాహుల్ గాంధీ అనేక సవాళ్లు, పరాజయాలు,వ్యక్తిగత విమర్శలను ఎదుర్కొంటూ ఎంతో పరిణతి చెందిన నాయకుడిగా ఆయన ఎదిగారన్నారు. దేశవ్యాప్తంగా సాగిన రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటూ ప్రజా హృదయాలకు మరింత దగ్గరయ్యారని ఆయన తెలిపారు. దేశంలోని సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రజల పక్షాన నిలబడుతున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ గారిని ప్రధాన మంత్రి ని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మండలం లోని అన్ని గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.




# నల్లగొండ జిల్లాలో ఘోర ప్రమాదం

## పరసస్రం ఢీకొన్న రెండు కార్లు...ముగ్గురు మృతి

## మృతుల్లో తండ్రీ కొడుకులు

**నల్లగొండ,జూన్19 (ప్రజా వీక్షణం)**

నల్లగొండ జిల్లాలోని పెద్దవూర మండలం రామన్నగూడెం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. రెండు కార్లు పరస్పరం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో తండ్రీకొడుకులతో పాటు మరొకరు ఉన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన తండ్రీకొడుకులు పల్నాడు జిల్లా ముప్పల్ మండలం కాకర్లపాలెం గ్రామానికి చెందిన కాకర్ల థామస్య(51), ప్రకాష్ రావు (35)గా గుర్తించారు. మరోవ్యక్తి వరంగల్ ఎస్ఎల్‌బీసీ సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సాయికుమార్(20)గా పోలీసులు తెలిపారు.

# రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయం

## - రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షులు రాజమూరి శ్రీనివాసులు

**దేవరకద్ర జూన్ 19 ప్రజావిక్షణం**

కాబోయే ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీ కావడం ఖాయమని రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షులు రాజమూ రి శ్రీనివాసులు అన్నారు. ఆయన శుక్రవారం రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ విషయాన్ని ప్రకటించారు. 2029 లో రాహుల్ గాంధీ దేశ ప్రధానిగా కావడం ఖాయం అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు కూడా కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నారని ఆయన తెలిపారు. బిజెపి ఎన్ని జిమ్మిక్కులు చేసినా కూడా ఈసారి ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీ కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# ఎస్ ఐ ఆర్ స్పెషల్ ప్రోగ్రాం కి అందరూ సహకరించాలి

**దేవరకద్ర జూన్ 19 ప్రజా విక్షణం**

ఎస్ ఐ ఆర్ పోగ్రానికి అందరు కూడా సహకరించాలని బిజెపి నాయకులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో జాతీయ ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గ మండల కేంద్రంలో పవన్ కుమార్ రెడ్డి, ఇంటి దగ్గర మండల అధ్యక్షులు కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా హాజరైన దేవరకద్ర నియోజకవర్గ భాజపా ఎస్ ఐ ఆర్ ఇంచార్జ్ కొత్తకాపు నారాయణరెడ్డి. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేవన్నసాగర్ ,4వ వార్డు కౌన్సిలర్ రాజు వెంకటేశ్వర్ రెడ్డి, అనిల్ కుమార్ (అప్పి), శ్రీశైలం ,బంగారం వెంకటేష్, రామ్ రెడ్డి, దొబ్బలి శ్రీనివాసులు, కురువ రాజు, తిరుపతయ్య మరియు మండల పదాధికారులు బి ఎల్ ఎ 2తదితరులు పాల్గొన్నారు.




# దేశీయ మార్కెట్లో బంగారం ధరలు పతనం

## పదిగ్రాములపై 3వేలకు పైగా దిగివచ్చిన ధరలు

**న్యూఢిల్లీ,జూన్19 (ప్రజా వీక్షణం)**

దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు పడిపోవడం వంటి పరిణామాలతో ఈ లోహాలకు డిమాండ్ తగ్గింది. దీంతో వీటి ధరలు కాస్తా తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,49,270గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.3000కు పైనే తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.37లక్షలు పలికింది. వెండి ధర ఒక్క రోజే రూ.8,600 తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు దిగొచ్చాయి. ఔన్సు పుత్తడి ధర 4,139 డాలర్లు, ఔన్సు వెండి ధర 63.85 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ. 1.46 లక్షలకు పడిపోయింది. సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.2.30లక్షలుగా కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ముగియడం, ఫెడ్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు కోలుకున్నాయి. అటు డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి విలువ కూడా బలపడుతోంది. చమురు ధరలు యుద్ధం మునుపటి స్థితికి దిగొస్తున్నాయి.

# స్వచ్ఛతా డ్రైవ్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన

## - పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు

**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 19 (ప్రజా వీక్షణం)**

పట్టణంలోని అన్ని వార్డుల్లో నాలుగు వారాలుగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా డ్రైవ్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆధ్వర్యంలో గత నెల 23 నుంచి నేటి వరకు నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రత్యేక స్వచ్ఛతా డ్రైవ్ శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమాన్ని స్థానిక చెన్నై షాపింగ్ మాల్ ప్రాంతంలో కమిషనర్ ఏసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వార్డుల్లో నిర్వహించిన స్వచ్ఛతా డ్రైవ్‌కు ప్రజల నుంచి అద్భుత సహకారం లభించిందని చెప్పారు. రోడ్లు, డ్రైన్లు, పార్కులు, బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేసి స్వచ్ఛమైన తాడేపల్లిగూడెం దిశగా అడుగు వేశామని చెప్పారు. ప్రతి పౌరుడు చెత్తను డస్ట్‌బిన్‌లోనే వేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించటంతో పాటు మన పట్టణాన్ని పచ్చగా, పరిశుభ్రంగా ఉంచుకోవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వెంకట రమణ, మున్సిపల్ మేనేజర్ రవి సుధాకర్, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు మేనేజర్ నాగరాజు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సీతారామ్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ జగదీశ్వర రావు, రెవెన్యూ ఆఫీసర్ ప్రసాద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, శానిటేషన్ సూపర్వైజర్ సోమేశ్వరరావు డిప్యూటీ ఇంజనీర్ పవన్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ రవీంద్ర, సచివాలయ సిబ్బంది, ఆఫీస్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛ తాడేపల్లిగూడెం కోసం ప్రతిజ్ఞ చేశారు..





# అమ్మవారికి ప్రత్యేక పూజలు

**దేవరకద్ర జూన్ 19 ప్రజా విక్షణం**

దేవరకద్ర మండల కేంద్రంలో స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి మహిళలు ప్రత్యేకంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలే ఆశకులు హరి శంకర శర్మ అమ్మవారికి అభిషేకాలు చేసి పట్టువసారలతో పూలతో అలంకరణ చేశారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో అమ్మవారి పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహిళలు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

# సిబ్బంది సమస్యల పరిష్కారానికి సీపీ గ్రీవెన్స్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 19 (ప్రజా వీక్షణం న్యూస్)**

పోలీస్ అధికారులు, సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వరంగల్ రేంజ్ కార్యాలయంలో 3, 4 జోన్ల సిబ్బంది కోసం ఈ కార్యక్రమం చేపట్టారు. పదోన్నతులు, బదిలీలు, క్రమశిక్షణ చర్యలకు సంబంధించి సిబ్బంది నుంచి వచ్చిన 13 దరఖాస్తులను సీపీ స్వయంగా పరిశీలించారు. ఈ సమస్యలను చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించా లని సంబంధిత అధికారుల ను ఆదేశించారు.



# సిరిచెల్మ కోలం గూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యా సామగ్రి పంపిణీ

**ఆదిలాబాద్ జిల్లా జూన్ 19 (ప్రజా వీక్షణం)**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ కోలం గూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేలు తదితర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సర్దార్ అభినవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కేతావత్ సర్దార్ అభినవ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి చేయూతనివ్వడం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యా సామగ్రి అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమకు సహాయం చేసిన ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు కూడా ఫౌండేషన్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని పలువురు అభిప్రాయపడ్డారు.



# మైనర్ల డ్రైవింగ్‌ను క్షమించేది లేదు

- స్కూల్ పిల్ల భద్రతపై యాజమాన్యాలదే బాధ్యత
- స్కూల్ యాజమాన్యాలతో భేటీఓ సిపి సజ్జన్నార్

**హైదరాబాద్,జూన్19 (ప్రజా వీక్షణం)**

మైనర్లు డ్రైవింగ్ చేస్తే అస్సలు క్షమించమని హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'స్కూల్ పిల్లల భద్రత'పై స్కూల్ యాజమాన్యాలు, సంబంధిత శాఖలతో ట్రాఫిక్ పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సిటీ పరిధిలో 3500లకు పైగా స్కూల్స్ ఉన్నాయని, వీటిలో 12 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. సేఫ్ స్కూల్ ఎన్విరాన్మెంట్ క్రియేట్ చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పాటించడం అన్నది అలవాటుగా మారాలని సూచించారు. విద్యాసంస్థల్లో ర్యాంక్స్ ఇంపార్టెంట్ కాదని.. సేఫ్ ఎన్విరాన్మెంట్ ముఖ్యమని సీపీ స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో స్కూల్ బస్సు డ్రైవర్లు పట్టుబడుతున్నారని తెలిపారు. విద్యార్థులు స్కూల్‌కు ఏ విధంగా వస్తున్నారనే దానిపై స్కూల్ యాజమాన్యం వద్ద పూర్తి రూట్‌మ్యాప్ ఉండాలన్నారు. పిల్లలు పాఠశాలకు వస్తున్నారంటే.. ఏం జరిగినా స్కూల్ యాజమాన్యానిదే బాధ్యత అని తేల్చిచెప్పారు. స్కూల్ బస్సులను నడిపే డ్రైవర్స్‌పై నిఘా ఉంచాలని సీపీ సూచించారు. ట్రాఫిక్ వాలంటీర్లు, మార్షల్స్‌ను విద్యాసంస్థలు నియమించుకోవాలని అన్నారు. పిల్లలు తెలిసీ తెలియక నేరాల్లో ఇన్వాల్వ్ అవుతున్నారని.. పిల్లలపై టీచర్స్, పేరెంట్స్ పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. స్కూల్ పరిసరాల్లో ఖచ్చితంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మడం నేరమని... అలాంటి వాటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు 45 మంది విద్యార్థులు యాక్సిడెంట్లో చనిపోతున్నారని, యాక్సిడెంట్లు మర్డర్ల కంటే ప్రమాదకరమన్నారు. అందుకే స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

# విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి...ఫీజుల దోపిడిని అరికట్టాలి...

## విద్య వ్యాపారికరణను ఆపాలి ..డివైఎఫ్ఐ

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 19 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.సచ్చిదానంద చారి కి వినతి.కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల పుట్టుక వస్తున్నాయి, ఎక్కడ చూసినా ప్రవేట్ పాఠశాల ఆధిపత్యం నడుస్తోంది విద్యార్థుల వద్ద నుంచి విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ జరుగుతుంది, అని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.సచ్చితానంద చారి కి వినతి పత్రం సమర్పించడం జరిగింది ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ జిల్లాలో ప్రవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయకుండా విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్య అందించాలి, ముఖ్యంగా కాగజ్ నగర్ మండలం లోని శ్రీ చైతన్య వీఐపీ శాంతినికేతన్ సెయింట్ క్లారిటీ,సెయింట్ మేరీ ఇతర పాఠశాలలో ఫీజుల పట్టిక నియ మించకుండా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు అంతేకాదు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పాఠశాలలో వ్యాపారంల షు బెల్ట్ టై యూనిఫామ్ మరియు పాఠ్యపుస్తకాలు అధిక రేట్లకు అమ్ముతూ విద్యను వ్యాపారం చేస్తు న్నారూ కావున ప్రవేట్ పాఠశాలలో పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించి పాఠ్యపుస్తకాలు ఇతర వాటినే అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ గా కోరుతున్నాం దీనికి



స్పందించిన డీఈవో తక్షణమే ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ అమ్ము తున్న పాఠశాలలపై చర్యలు తీసు కుంటామని అన్నారు, విద్యా హక్కు చట్టం ప్రకారంగా ప్రవేట్ పాఠశాలలు నడిచే విధంగా నోటీసులు ఇస్తామని అన్నారు అంతే కాదు పేద విద్యా ర్థులకు 25 శాతం ఉచిత విద్య అందించే విధంగా చర్యలు చేపడతా మని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్ ఉన్నారు.

# రోడ్డుపై జారిన మట్టి: ముగ్గురు ద్విచక్ర వాహనదారులకు గాయాలు!

- కొత్తూరు చెరువు నుండి లారీల ద్వారా మట్టి తరలింపు
- వర్షానికి బురదమయమైన రహదారి.. రామయ్యపేట సమీపంలో ప్రమాదాలు
- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం

**పోలవరం, జూన్ 19 (ప్రజా వీక్షణం):**

ఏలూరు జిల్లా పోలవరం మండలం లోని కొత్తూరు చెరువు నుండి పోల వరం ప్రాజెక్టు ప్రాంతానికి లారీల ద్వారా జరుగుతున్న మట్టి తరలింపు వాహనదారుల ప్రాణాల మీదకు తెస్తోంది. శుక్రవారం ఉదయం నుండి కురిసిన వర్షానికి రోడ్డుపై పడిన మట్టి కాస్తా బురదగా మారడంతో రహదారి పూర్తిగా జారుడుమయమైంది. ఈ క్రమంలో రామయ్యపేట సమీపంలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కింద పడటంతో ముగ్గురు వాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో పోలవరం కొత్తపేట గ్రామానికి చెందిన ముంత సుబ్బారావు అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. బైక్ ఒక్క సారిగా జారిపడిపోవడంతో ఆయన మోకాలి జాయింట్‌కు తీవ్రమైన దెబ్బ తగిలింది. ఆ సమయంలో రోడ్డుపై వెళ్తున్న ఇతర వాహనదారులు, స్థాని కులు వెంటనే స్పందించి, ఆయనను చికిత్స నిమిత్తం పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాజెక్టు పనుల కోసం లారీల ద్వారా మట్టిని తరలిస్తున్న సమయంలో రోడ్డుపై పడుతున్న మట్టిని సకాలంలో శుభ్రం చేయకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

"లారీల నుండి మట్టి రోడ్డుపై పడకుండా నియంత్రించాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లు, అధికారులపై ఉంది. వర్షం పడినప్పుడు ఈ రోడ్లు నరకాన్ని తలపిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి రహదారులను శుభ్రం చేయించడంతో పాటు, ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలి." అంటూ స్థానిక గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు స్పందించి మట్టి రవాణా చేసే లారీలపై నిఘా ఉంచాలని, ప్రయాణి కుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





# గుబ్బల మంగమ్మ గుడి సరిహద్దులు తేల్చాలి : ఎస్టీ కమిషన్‌కు వినతి

- ఉమ్మడి సర్వే నిర్వహించి సరిహద్దు రాళ్లు పాతాలి
- గిరిజనుల ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలి
- స్థానిక గిరిజన యువత, మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలి





**బుట్టాయిగూడెం, జూన్ 19:(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలంలోని ప్రసిద్ధ గిరిజన పుణ్యక్షేత్రం 'గుబ్బల మంగమ్మ' ఆలయ సరిహద్దులను రెవెన్యూ, అటవీ శాఖల సంయుక్త సర్వే ద్వారా తక్షణమే ఖరారు చేయాలని గుబ్బల మంగమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల( ఎస్టీ ) కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు కమిషన్ చైర్మన్‌కు శుక్రవారం ఒక సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. తరతరాలుగా గిరిజనుల ఆరాధ్య దైవంగా, వారి సంస్కృతి, సంప్ర దాయాలకు ప్రతీకగా నిలిచిన ఈ పవిత్ర క్షేత్రాన్ని పరిరక్షించి, అభివృద్ధి చేయాలని వారు కోరారు.

సరిహద్దు వివాదాలకు ముగింపు పలకాలి ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు దర్శించుకునే ఈ ఆలయ పరిసరాల్లో సరిహద్దులు స్పష్టంగా లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని కమిటీ ప్రతి నిధులు పేర్కొన్నారు. బుట్టాయగూడెం తహసీల్దార్ అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా 'జాయింట్ రోవర్ సర్వే' నిర్వహించి, ఆలయ భూములను అధికారికంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సర్వే అనంతరం శాశ్వత సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసి, ఉభయ శాఖల రికార్డులలో నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### మౌలిక సదుపాయాల కల్పన అత్యవసరం

ఆలయానికి వచ్చే భక్తుల కోసం అన్ని కాలాల్లోనూ ప్రయాణించేలా పక్కా రహదారి, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, విశ్రాంతి షెడ్లు, పార్కింగ్ వంటి కనీస మౌలిక సదు పాయాలను కల్పించాల్సిన అవసరం ఉందని వినతిపత్రంలో వివరించారు. ప్రస్తుతం గిరిజనుల ఆధ్వర్యంలోనే నడుస్తున్న ఆలయ కమిటీకి ప్రభుత్వ పరంగా ప్రత్యేక నిధులు, పరిపాలనా మద్దతు అందించాలని కోరారు.

### గిరిజనులకే ఉపాధి ప్రాధాన్యత ఇవ్వాలి

ఆలయ అభివృద్ధి ద్వారా లభించే ఆర్థిక ప్రయోజనాలు స్థానిక గిరిజనులకే చెందాలని ఆలయ కమిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు పత్రికా ప్రకటనలో పలు కీలక డిమాండ్లను లేవనెత్తారు:

### యువతకు ఉద్యోగాలు:

ఆలయ నిర్వహణ, భద్రత, పరిశుభ్రత విధుల్లో స్థానిక గిరిజన యువతకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి.

వ్యాపార అవకాశాలు : ప్రసాదాల విక్రయం, పార్కింగ్ నిర్వహణ, దుకా ణాల కేటాయింపులను గిరిజనులకే అప్పగించాలి.

### మహిళా సంఘాలకు చేయూత :

గిరి జన మహిళా పొదుపు సంఘాలకు ప్రసాదాల తయారీ, స్థానిక అటవీ ఉత్పత్తులు, హస్తకళల విక్రయ కేంద్రాల బాధ్యతలు అప్పగించి స్థిరమైన జీవనోపాధిని చూపాలి.

### ప్రత్యేక కార్యాచరణకు డిమాండ్

గుబ్బల మంగమ్మ క్షేత్రాన్ని ఒక ఆధ్యాత్మిక మరియు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కమిటీ కోరింది. అంతేకాకుండా గిరిజనుల హక్కులు, ప్రయోజనాలకు భంగం కలగకుండా ఎస్టీ కమిషన్ ప్రత్యేక జోక్యం చేసుకుని, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని గిరిజన ప్రతినిధులు వినయపూర్వకంగా ప్రార్థించారు.

# ఈనెల 22న కొయ్యలగూడెంలో పోలవరం నియోజకవర్గ భారీ కూటమి సమావేశం

- హాజరుకానున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్, మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు
- తరలిరావాలని టీ.నరసాపురం మండల తెలుగు యువత అధ్యక్షుడు కాల్నీడి శ్రీనివాస్ పిలుపు

**కొయ్యలగూడెం జూన్ 19(ప్రజా వీక్షణం)**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, ఈనెల 22వ తేదీన (సోమవారం ) పోలవరం నియోజక వర్గ స్థాయి భారీ బహిరంగ సమా వేశాన్ని ఏర్పాటు చేసినట్లు టి.నరసా పురం మండల తెలుగు యువత అధ్యక్షుడు కాల్నీడి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.కొయ్యలగూడెం మండల పరిధిలోని కన్నాపురం రోడ్డులో గల 'సురేష్ కన్వెన్షన్ హాల్' లో ఈనెల 22-06-2026 సోమవారం సాయంత్రం 3:00 గంటలకు ఈ నియోజకవర్గ స్థాయి కీలక సమావేశం ప్రారంభం కానుంది.

**ముఖ్య అతిథులుగా ప్రముఖులు:**

టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ బొరగం శ్రీనివాసులు అధ్యక్షతన జరగనున్న ఈ ప్రతిష్టాత్మక సమావేశానికి కూటమి ప్రభుత్వంలోని పలువురు కీలక నేతలు హాజరుకానున్నారు.వారిలో
ఏలూరు పార్లమెంట్ సభ్యులు (ఎంపీ )పుట్టా మహేష్ కుమార్, రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి, జిల్లా టీడీపీ అధ్యక్షులు శ్రీ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు,నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరావు పాల్గొంట్టారు అలాగే ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో సాధించిన ప్రగతి, నియోజకవర్గ అభివృద్ధి పనులు, భవిష్యత్తు కార్యాచరణపై ముఖ్య నేతలు దిశా నిర్దేశం చేయనున్నారు."కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా జరుగుతున్న ఈ భారీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి. టి.నరసాపురం మండలంలోని కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు అందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నాం." అంటూ కాల్నీడి శ్రీనివాస్ (టి.నరసాపురం మండల తెలుగు యువత అధ్యక్షులు) తెలిపారు.



# నీట్ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

- వరంగల్ పోలీస్ కమిషనర్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 19 (ప్రజా వీక్షణం న్యూస్)**




ఆదివారం జరిగే నీట్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞ లు అమలు చేస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషన్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో ఈ నెల 21వ తారీకు ఆదివారం జరిగే నీట్ పరీక్ష సంబంధించి పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేయబడతాయని. ఈ ఉత్తర ప్రకారం పరీక్ష జరిగే 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులుగా గుమి కూడటం, సభలు సమావేశా లు ర్యాలీలు ధర్నాలు నిషేధించబడ్డాయని, పరీక్షా జరిగే పరిసరాలలో పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్ల ను మూసివేయాలని ఈ ఉత్తర్వులు ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుం దని ఎవరైనా ఈ ఉత్తరం అతిక్రమిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకో బడతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

# పోలవరం నియోజకవర్గంలో నేడు 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ ' నిధుల పంపిణీ

- పాల్గొననున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

**బుట్టాయగూడెం:జూన్ 20(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ పరిధిలోని రైతన్నలకు లబ్ధి చేకూరుస్తూ 2026-27 సంవత్సరానికి గానూ మొదటి విడత "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్" నిధుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ రోజు అనగా శనివారం (జూన్ 20) న నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో స్థానిక పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ముఖ్య అతిథిగా పాల్గొని నిధుల పంపిణీని ప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమం సందర్భంగా నియోజకవర్గంలో భారీ ర్యాలీని తలపెట్టారు. బర్రింకలపాడు క్యాంపు కార్యాలయం నుండి బుట్టాయగూడెం వరకు ఈ భారీ ర్యాలీ సాగనుంది. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో పాటు కూటమి నాయకులు, భారీ సంఖ్యలో జనసైనికులు, కార్యకర్తలు మరియు రైతులు పాల్గొననున్నారు.కార్యక్రమ వివరాలు: ప్రకారం తేదీ: 20-06-2026 (శనివారం) సమయం: మధ్యాహ్నం 2:30 గంటలకు అలాగే వేదిక: బుట్టాయగూడెం ఎంపీడీవో (ఎంపీ డివో )కార్యాలయ ఆవరణం రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కూటమి వర్గాలు పిలుపునిచ్చాయి.




# కె.వి.కె ఆధ్వర్యంలో చేపలు, రొయ్యల వ్యాధులపై ఐదు రోజుల శిక్షణ

- శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి ధనుంజయరావు





**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 19 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు ఆర్థిక సహకారంతో చేపలు, రొయ్యల వ్యాధులు, నిర్ధారణ పరికరాలు, నిర్వహణ పద్ధతులు అనే అంశంపై ఐదు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథి వర్శిటీ ఉపకులపతి డాక్టర్ కె.ధనుంజయ రావు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మత్స్య, ఆక్వాకల్చర్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. చేపలు, రొయ్యల సాగులో వ్యాధుల ప్రబలత రైతులకు భారీ ఆర్థిక నష్టాలను కలిగిస్తోందని తెలిపారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, శాస్త్రీయ పద్ధతులతో నివారించడం ద్వారా స్థిరమైన ఉత్పత్తి, అధిక ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. సాధించవచ్చని తెలిపారు. ఆధునిక వ్యాధి నిర్ధారణ పద్ధతులు, బయోసెక్యూరిటీ చర్యలు, సమర్థవంతమైన నిర్వహణ విధానాలపై అవగాహన పొందేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. విస్తరణ సంచాలకురాలు డాక్టర్ సి.హెచ్.రూత్ మాట్లాడుతూ రైతులు, మత్స్యకారులకు శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడంలో కృషి విజ్ఞాన కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ఆక్వాకల్చర్ రంగంలో ఎదురవుతున్న వ్యాధి సమస్యలు, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. విద్యార్థి వ్యవహారాల డీన్, విశ్వవిద్యాలయ గ్రంథాలయాధికారి డాక్టర్ సి.మధుమతి మాట్లాడుతూ చేపలు, రొయ్యలు ఆరోగ్య నిర్వహణలో ఆధునిక నిర్ధారణ సాంకేతికతల ప్రాధాన్యతను వివరించారు. గేదెల పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.ఆనందరావు మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో మత్స్య పరిశ్రమ ప్రాధాన్యతను తెలియజేశారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా రైతులు అధిక లాభాలను పొందవచ్చన్నారు. రొయ్యల్లో వైట్ స్పాట్ సిండ్రోమ్, చేపల్లో బాక్టీరియల్ వ్యాధులు వంటి సమస్యలపై పరిశోధనలు అవసరమని, ఈ శిక్షణ అందుకు దోహద పడుతుందని వివరించారు. కోర్స్ డైరెక్టర్, సీనియర్ సైంటిస్ట్, హెడ్ డాక్టర్ సి.హెచ్. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా వ్యాధుల రకాలు, ఆధునిక నిర్ధారణ పరికరాల వినియోగం, బయోసెక్యూరిటీ, నీటి నాణ్యత నిర్వహణ, ప్రోబయోటిక్స్, ఇమ్యూనోస్టిమ్యులెంట్ల వినియోగం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తామని వివరించారు. కోర్స్ కో-డైరెక్టర్ డాక్టర్ ఎ. దేవివరప్రసాద్ రెడ్డి, కో ఆర్డినేటర్లు డాక్టర్ ఇ.రేఖ, డాక్టర్ కె.అర్చనలు ఈ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో చేపలు, రొయ్యల ప్రధాన వ్యాధులు, వాటి లక్షణాలు, వ్యాధి నిర్ధారణకు ఉపయోగించే ఆధునిక పరికరాలు, ప్రయోగశాల సాంకేతికతలు, బయోసెక్యూరిటీ చర్యలు, నీటి నాణ్యత నిర్వహణ, వ్యాధి నివారణ, నిర్వహణ వ్యూహాలపై నిపుణులు శిక్షణ అందించనున్నామని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగేందుకు సహకరిస్తున్న ఎన్ఎఫ్డీబీ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తాం

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ స్వరాజ్యలక్ష్మి

**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 19 (ప్రజా వీక్షణం)**

ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఈ.స్వరాజ్యలక్ష్మి హెచ్చరించారు. తాడేపల్లిగూడెం ప్రొహెషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేయరాదని, చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేసి సాధారణ ప్రజానీకానికి ఏ విధమైన ఇబ్బంది కలుగజేయకూడదని ఆమె శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరాజ్యాలక్ష్మి మాట్లాడుతూ మద్యం అలవాటు ఉన్నవారు ప్రభుత్వం అనుమతించిన పర్మిట్ రూముల్లో గాని, ఎవరి ఇంటి వద్ద వారే సేవించాలని చెప్పారు. అనుమతి లేని బహిరంగ ప్రదేశాల్లో, దాబాల్లో, ఇతర ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఏలూరు జిల్లా పోలీసు సిబ్బంది సంక్షేమమే లక్ష్యం

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమస్యలు ఆలకించిన ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్

**ఏలూరు:జూన్ 19(ప్రజా వీక్షణం)**






జిల్లా పోలీసు సిబ్బంది సంక్షేమానికి తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏలూరు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ స్పష్టం చేశారు. సిబ్బంది ఎదుర్కొంటున్న వ్యక్తిగత, వృత్తిపరమైన సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఆయన ఒక ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని పలు విభాగాల పోలీసు సిబ్బందితో ఎస్పీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నిరంతరం ప్రజల రక్షణ కోసం శ్రమించే పోలీసు సిబ్బంది మానసిక ప్రశాంతత, సంక్షేమం తమకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు."సిబ్బంది మానసికంగా, శారీరకంగా దృఢంగా మరియు సంతోషంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత సమర్థవంతంగా, మెరుగైన సేవలు అందించగలరు."అని కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ (జిల్లా ఎస్పీ) తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ భాగంగా సిబ్బంది తమ బదిలీలు, సెలవులు, ఆరోగ్య సమస్యలు మరియు ఇతర సర్వీసు సంబంధిత ఇబ్బందులను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. వాటన్నింటినీ ఓపికగా విన్న ఆయన, అర్హమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీసు సిబ్బంది క్షేమమే ధ్యేయంగా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆయన హామీ ఇచ్చారు.జిల్లా ఎస్పీ స్వయంగా చొరవ తీసుకుని తమ సమస్యలను నేరుగా అడిగి తెలుసుకోవడం పట్ల జిల్లా పోలీసు సిబ్బంది మరియు అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 19 (ప్రజా వీక్షణం న్యూస్)**

జిల్లాలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద శుక్రవారం పరిశీలించా రు. ఆసుపత్రి భవన నిర్మా ణం, మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు, పారిశు ధ్యం తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.పనులను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పను ల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి పూర్తయితే జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీ లో సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.





# ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న 'విగ్నేష్'

- అరుదైన వ్యాధితో మంచానికే పరిమితమైన తొమ్మిదేళ్ల బాలుడు
- అప్పులు చేసి రూ.15 లక్షలు ఖర్చు చేసిన కూలీలైన తల్లిదండ్రులు
- 87% వైకల్యం ఉన్నా అందని ప్రభుత్వ పెన్షన్.. దాతలు ఆదుకోవాలని వేడుకోలు

**పోలవరం, జూన్ 19 (ప్రజా వీక్షణం):**

రెక్కాడితే గాని డొక్కాడని ఆ నిరుపేద కుటుంబంలో అంతుచిక్కని అరుదైన వ్యాధి తీవ్ర విషాదాన్ని నింపింది. తోటి పిల్లలతో కలిసి ఆడుతూ పాడుతూ స్కూలుకు వెళ్లాల్సిన తొమ్మిదేళ్ల బాలుడు, విధి ఆడిన వింత నాటకంలో నేడు కదలలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. నెల నెలా మందులు కొనే స్తోమత లేక, ప్రభుత్వ సాయం అందక ఆ కుటుంబం దాతల సాయం కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తోంది.ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని వేలేరు గ్రామానికి చెందిన ఘంటసాల వెంకన్న, సుభద్ర దంపతులకు 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. మొదటి సంతానమైన విగ్నేష్ పెదరాయిగూడెంలోని అప్పర్ ప్రైమరీ స్కూల్లో చదువుతుండగా కాలికి గాయమైంది. బూర్గంపాడు, భద్రాచలంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చూపించగా అసలు విషయం బయటపడింది. అది ఒక అరుదైన జన్యు సంబంధిత వ్యాధి అని, శరీరంలో ఎక్కడ గాయమైనా రక్తం గడ్డకట్టుకుపోతుందని (బ్లడ్ ఇన్ఫెక్షన్), బాలుడు ఎక్కువ సమయం కూర్చోలేడని, నడవలేడని వైద్యులు నిర్ధారించారు. జీవితకాలం మందులు వాడాలని సూచించారు.ప్రస్తుతం విగ్నేష్‌కు కుడికాలి వేళ్ల నుంచి మడెం వరకు తీవ్రమైన ఇన్ఫెక్షన్ కావడంతో నడవలేని స్థితికి చేరుకున్నాడు. కన్నబిడ్డను కాపాడుకోవడానికి ఆ తల్లిదండ్రులు భద్రాచలం, ఖమ్మం, హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. తల్లిదండ్రులు ఇద్దరూ రోజువారీ రైతు కూలీలు కావడంతో, వైద్య ఖర్చుల కోసం స్థానికుల సహకారంతో దాదాపు రూ. 15 లక్షల వరకు అప్పులు చేశారు. ప్రస్తుతం ప్రతి నెలా మందుల కోసమే రూ. 7,000 నుండి రూ. 10,000 వరకు ఖర్చవుతుండటంతో, అంత శక్తి లేక చేతులెత్తేశారు.బాధిత బాలుడు విగ్నేష్‌కు ప్రభుత్వం జారీ చేసిన 'సదరం' సర్టిఫికెట్‌లో 87 శాతం అంగవైకల్యం ఉన్నట్లు స్పష్టంగా ఉంది. యూనిక్ డిసబిలిటీ ఐడీ కూడా ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఎన్టీఆర్ భరోసా' పథకం ద్వారా తీవ్ర వైకల్యంతో మంచం పట్టిన వారికి నెలకు రూ. 15,000 పెన్షన్ అందిస్తున్నప్పటికీ, ఈ బాలుడికి మాత్రం ఇప్పటివరకు రూపాయి పెన్షన్ కూడా మంజూరు కాలేదు. "మా బాబుకు పెన్షన్ వస్తే ప్రతి నెల మందులకైనా ఉపయోగపడుతుంది, అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి" అని కన్నీరుమున్నీరవుతూ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.ఆర్థికంగా పూర్తిగా చితికిపోయిన ఈ పేద కుటుంబాన్ని, మంచాన పడ్డ చిన్నారిని కాపాడటానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ప్రార్థిస్తున్నారు. సాయం చేయదలచిన వారు క్రింది బ్యాంకు ఖాతా లేదా ఫోన్ పే నంబర్ ద్వారా ఆర్థిక సాయం అందించవచ్చు. సహాయం చేయదలచిన వారి కోసం బ్యాంక్ వివరాలు: బ్యాంక్ పేరు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బిఐ ) ఖాతాదారుని పేరు: ఘంటసాల సుభద్ర ఖాతా సంఖ్య: 62394450540 (ఐ ఎఫ్ ఎస్ సీ )కోడ్:సాదీ×చీ0020168 బూర్గం



పహాడ్ బ్రాంచ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.ఫోన్ పే నంబర్: 97051 01359 అని తెలియజేయడం జరిగింది.

# ఆర్థిక సాధికారతకు శిక్షణలే బలమైన పునాది

- శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాల ను అందిపుచ్చుకోవాలి
- హసన్‌పర్తిలో ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను సందర్శించి న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి







**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 19 (ప్రజా వీక్షణం న్యూస్)**

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించేం దుకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్విని యోగం చేసుకుని మహిళ లు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు (సీఆర్పీలు) తమతో పాటు సమాజ ఆర్థికాభివృద్ధి కి దోహదపడాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచిం చారు. శుక్రవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలోని సంస్కృతి విహార్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ ఆర్‌సెటీ)లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 64 మంది కమ్యూని టీ రిసోర్స్ పర్సన్లకు నిర్వ హిస్తున్న ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని (ఫైనాన్షియల్ లిటరసీ అవేర్‌నెస్ ప్రోగ్రామ్) జిల్లా కలెక్టర్ సందర్శిం చారు. ఈ సందర్భంగా శిక్షణ కార్య క్రమం నిర్వహణ, లక్ష్యాలు, అంది స్తున్న అంశాలపై వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల సభ్యుల్లో డిజిటల్ లావా దేవీలు, నగదు రహిత చెల్లింపులు, సైబర్ నేరాల నివారణ, బ్యాంకింగ్ సేవల వినియోగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బీమా పథకాలపై సీఆర్పీ లకు సమగ్ర అవగాహ న కల్పిస్తున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్‌బీఐ ఆర్‌సెటీ ఇన్‌చార్జి డైరెక్టర్ మహేందర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లా డుతూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ స్థాయిలో మహిళా సంఘాల సభ్యులకు సమర్థవంతంగా చేరవేసి ఆర్థిక అక్షరాస్యత ను మరింత విస్తరించాల్సిన బాధ్యత సీఆర్పీలపై ఉంద న్నారు. ఆర్థిక వ్యవహారాలపై అవగాహన పెరగడం ద్వారా కుటుం బాలు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతా యని పేర్కొన్నారు. సంస్థలో కుట్టు, బ్యూటీ పార్లర్ మేనేజ్ మెంట్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న 40 మంది మహిళలతో కలెక్టర్ ముఖా ముఖి నిర్వహించా రు. శిక్షణ ద్వారా పొందుతు న్న నైపుణ్యాలను స్వయం ఉపాధి అవకాశాలుగా మలుచుకుని ఆర్థిక స్వావ లంబన సాధించాలని సూచించారు. మహిళలు ఉపాధి అవకాశాలను సృష్టించుకునే దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు.సంస్కృతి విహార్ ప్రాంగణం లో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన్ పనులను కలెక్టర్ పరిశీలిం చారు. నిర్మాణ పనుల పురో గతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతా ప్రమా ణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించా రు. ఈ కార్యక్రమంలో డీఆర్ డీఓ మేన శ్రీను, తహసీల్దార్ కిరణ్ కుమార్, డీఈ శ్రీనివా సరావు, సంబ ంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- మున్నలూరులో ప్రజా దర్బార్ నిర్వహించిన
- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**కంచికచర్ల జూన్ 18 (ప్రజావీక్షణం )**

మొన్నలూరు గ్రామస్తుల అర్జీల స్వీకరణ కొత్త పెన్షన్లు, హౌసింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ. కంచికచర్ల మండలం మున్నలూరు గ్రామంలో శుక్రవారం అధికారులు, కూటమి నాయకులతో కలిసి నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు వివరించి అర్జీలు అందజేశారు.ప్రజల సమస్యలను క్షుణ్ణంగా విన్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కొత్త పెన్షన్లు గృహ నిర్మాణ పథకాల కోసం వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తోందని, ప్రజా దర్బార్ కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగవంతంగా పరిష్కరిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షులు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు అధికారులు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మలేషియాలో మంత్రి నారాయణ పర్యటన

- ఘన వ్యర్థాల నిర్వహణపై మంత్రి పరిశీలన

**అమరావతి,జూన్19 (ప్రజా వీక్షణం)**

మలేషియాలో ఏపీ మంత్రి నారాయణ పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. మలేషియాలో ఘన వ్యర్థాల నిర్వహణ, తక్కువ ధరలో ఇళ్ల నిర్మాణం వంటి ప్రాజెక్టుల్లో అమలు చేస్తున్న అత్యుత్తమ పద్ధతులను మంత్రి అధ్యయనం చేస్తున్నారు. సెలాంగోర్ రాష్ట్రంలోని బుకిత్ తగర్ ఎన్విరో పార్క్‌ను సందర్శించారు. మలేషియాలో అతిపెద్ద శానిటరీ ల్యాండ్ ఫీలింగ్ ప్రాంతంగా బుకిత్ తగర్ పేరొందింది. ఘన వ్యర్థాలను పర్యావరణానికి హాని లేకుండా శాస్త్రీయ పద్ధతిలో పూడ్చిపెట్టే విధానాన్ని మంత్రి అధ్యయనం చేశారు. భూమి, నీరు కలుషితం కాకుండా వ్యర్థాల నిర్వహణ ఏ విధంగా చేస్తున్నారో మంత్రికి అధికారులు వివరించారు. బెర్జయ గ్రూప్ నిర్మిస్తున్న హౌసింగ్ ప్రాజెక్టులను పరిశీలించనున్నారు. బెర్జయ గ్రూప్.. తక్కువ ధరలో అందరికీ అందుబాటులో ఉండేలా ఇళ్లను నిర్మిస్తోంది.

# కూటమి ప్రభుత్వ పాలనలో ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరం

- వైసీపి నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురాం నాయుడు

**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 19 (ప్రజా వీక్షణం)**

కూటమి ప్రభుత్వ పాలనలో ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త,అప్పడా మాజీ వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ నాయుడు ఎద్దేవాచేశారు. స్థానిక సవిత్రుపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. వైసీపి ప్రభుత్వ హయాంలోనే ఆక్వా రైతులకు న్యాయం జరిగిందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఆక్వా రైతులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఆక్వా డెవలప్మెంట్ అథారిటీతో వారికి ఎంతో మేలు జరిగిందని గుర్తు చేశారు. రైతులను ఆదుకోవాలని వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్పందించిన వెంటనే ఈ కూటమి ప్రభుత్వం ఒక స్టేట్మెంట్ విడుదల చేయటం పరి పాటిగా మారిందని ఎద్దేవా చేశారు. ఇటీవల ఆక్వారైతులు, ఆక్వారైతు సంఘ నాయకులు జగన్మోహన్ రెడ్డిని కలిసి ఈ కూటమి ప్రభుత్వ హయాంలో వారు పడుతున్న ఇబ్బం దులు, సమస్యలను చెప్పుకున్నా రన్నారు. ఈ విషయంపై జగన్మోహన్ రెడ్డి ఫీడ్ సీడ్ ధరలను వెంటనే తగ్గించాలని, లేకపోతే ఆక్వా రైతుల తరపున ఉద్యమం చేస్తామని హెచ్చ రించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సాయంత్రం ఆక్వా అధికారులతో సమావేశమై పెంచిన రూ10 రూపాయల ఫీడ్ ధరకు రూ 2 రూపాయలు తగ్గించారని చెప్పారు. ఫీడ్ ముడి సరుకులు తగ్గినా, పెరిగినా కూడా ధరను పెంచుతూనే ఉన్నా రన్నారు. ముడి సరుకు ధర పెరగ టంతో పెంచామని చెప్పుకునే నాయ కులు మొన్నటి వరకు ధరలు తగ్గి నప్పుడు ఎందుకు ఫీడ్ ధర తగ్గించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ముడి సరుకు పెరిగిందని ఫీడ్ ధరలను పెంచితే వెంటనే రోల్ బ్యాక్ చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికె దక్కుతుందని కొనియాడారు. 0.92




నుంచి 0.95 వరకు పెట్టిన పవర్ ఫ్యాక్టర్ ని వెంటనే తొలగించాలని, ఆక్వా రైతులను ఆదుకోవాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS

20 శనివారం, జూన్ 2026 | 9 | www.prajaveekshanam.in

# క్యాన్సర్ పోర్టల్‌లో తప్పని సరిగా నమోదు చేయాలి

## - తప్పుడు రిపోర్టులు ఇస్తే సెంటర్లు సీజ్ చేస్తాం

## - డీఎంహెచ్‌ఓ డా. రాంకుమార్






ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 19 (ప్రజా వీక్షణం న్యూస్)

ప్రభుత్వం క్యాన్సర్ ను నోటిఫైయబుల్ వ్యాధుల జాబితాలో చేర్చినందున జిల్లా లోని క్లినిక్ లు, డయాగ్నొస్టిక్ సెంటర్ లు హాస్పిటల్ లు తప్పనిసరిగా తెలంగాణ క్యాన్సర్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని, గుర్తించిన చికిత్స అందించిన లేదా తమ వద్దకు వచ్చిన క్యాన్సర్ కేసులను పోర్టల్ లో తప్పని సరిగా నమోదు చేయాలని హనుమకొండ డిఎంహెచ్వో డాక్టర్ ఎస్ .డి .రాంకుమార్ ఆదేశించారు. అందులో భాగంగా ఆయన శుక్రవారం హనుమకొండ లోని రెనోవా బన్ను క్యాన్సర్ హాస్పిటల్, అజర హాస్పిటల్ విజయ డయాగ్నొస్టిక్ సెంటర్,రాడార్ డయాగ్నొస్టిక్ సెంటర్లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోర్టల్ లో వారు నమోదు చేస్తున్న తీరు ను స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతం నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోద వుతుండడం అలాగే మరణా లు ఎక్కువగా నమోదవుతు న్నందున వ్యాధి తీవ్రతను రిస్క్ ఫ్యాక్టర్లను ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ఒక సమగ్రమైన ప్రణాళిక రూపొందించడంలో భాగంగా ప్రత్యేకించిన ఈ పోర్టల్ లో ప్రతి క్లినిక్ ఆసుపత్రి నమోదు చేసుకొని తమవద్ద నిర్ధారించబడిన చికిత్స అందిస్తున్న, తమ ఓపికి వచ్చిన అన్ని రకముల క్యాన్సర్ కేసుల పూర్తి వివరాలు పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. లేబరేటరీలు, డయాగ్నొస్టిక్ సెంటర్లు నాణ్యత ప్రమాణా లు తప్పనిసరిగా పాటించా లని, వ్యాధి నిర్ధారణలో రిపోర్టింగ్ లో ఏమాత్రం నిర్లక్ష్యం చూపకూడదన్నారు. రాబోయే వర్షాకాలంలో రాపిడ్ డయాగ్నొస్టిక్ టెస్టింగ్ ద్వారా పాజిటివ్ లను అన్నింటిని డెంగ్యూగా నిర్ధారించి ప్రజల ను ఆందోళనకు గురి చేయవద్దని డెంగ్యూ ఎలిసా పాజిటివ్ నిర్ధారణ అయిన వారికి డెంగ్యూ ప్రోటోకాల్ ప్రకారం చికిత్స అందించాలన్నారు. ప్లేట్లెట్ కౌంట్ తగ్గిన ప్రతి కేసు డెంగ్యూగా పరిగణించకూడదన్నారు. తప్పుడు రిపోర్టు లు అందించే సెంటర్లను సీజ్ చేయడం జరుగుతుందన్నా రు. ఈ తనిఖీలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి. మదన్మోహన్రావు, ఎన్సీడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్ రెడ్డి, డిపి ఓ రుక్మోద్దీన్, సంబంధిత ఆసుపత్రుల డాక్టర్లు పాల్గొన్నారు.

# ఏడు రకాలే సాగు చేయాలన్న ఆంక్షలు సరికాదు

## రైతులకు అండగా ప్రభుత్వం నిలబడాలి

## మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

మహబూబ్‌నగర్,జూన్19 (ప్రజా వీక్షణం)

ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇప్పటికే సాగులో ముందుకు సాగలేక ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం కేవలం 7 సన్నరకాల పంటలనే సాగు చేయాలని ఆంక్షలు పెట్టడం సరికాదని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి హితవు పలికారు. దిగుబడి లేని పంటలను సాగు చేయాలంటే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ప్రభుత్వం సూచించే ఆ ఏడు రకాల పంటలకు చీడపురుగుల సమస్య కూడా అధికంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం నాడిక్కడ మాట్లాడుతూ గతంలో 33 సన్న రకాలను గుర్తించిన రేవంత్‌రెడ్డి సర్కార్.. ఇప్పుడు ఏడింటికే కుదించడం ఏమిటని ప్రశ్నించారు. రైతులు ఏ రకమైన పంట సాగుచేసినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే నమ్మకాన్ని, భరోసాను రైతులకు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఖరీఫ్‌లోనైనా రైతు భరోసా రూ.15,000 చొప్పున వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం బోనస్ ఇవ్వడాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా మర్చిపోయిందని విమర్శించారు. రైతు బీమా ఏమైందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చనిపోయిన రైతుల కుటుంబ సభ్యులు చెప్పులరిగేలా తిరుగుతున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. 'యూరియా సామాన్యులకు ఏమి అర్థమవుతుందని పేర్కొన్నారు. ఈసారైనా రైతులు యూరియా కోసం పడికాపులు కాయకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో వరి ధాన్యం కొనుగోలు చేయకపోతే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటి ముందు ధాన్యం పోసి ధర్నా చేస్తానన్న రేవంత్.. ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పెద్ద ప్రకటనలు గుప్పిస్తున్నదే తప్ప క్షేత్రస్థాయిలో రైతులకు దకిందేమీ లేదని తెలిపారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను రైతులు అడ్డికి పావుసేరు చొప్పున అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం సేకరణ బాధ్యతల నుంచి తప్పించుకొనేందుకే కుంటిసాకులు వెతుకుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

## - ప్రతి దశను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలి

## - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి






ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 19 (ప్రజా వీక్షణం న్యూస్)

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) 2026 ప్రక్రియ ను పకడ్బందీగా నిర్వహించా లని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణ పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారు లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హన్మకొండ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, వాటి తిరిగి స్వీకరణ, ఓటరు వివరాల ధృవీకరణ తదితర ప్రక్రియలను ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. జిల్లాల వారీగా ఎస్ఐఆర్ అమలుకు చేపట్టి న చర్యలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాల వివరాలను కలెక్టర్లను అడిగి తెలుసు కున్నారు. మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా హన్మకొండ జిల్లా కలెక్టర్ అండ్ జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు, బీఎల్ వో సూపర్‌వైజర్లకు శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రక్రియను శనివారం నాటికి పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, ఈఆర్వో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి, విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కథనాలను పర్య వేక్షించేందుకు మీడియా సెల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించేందుకు 2కె రన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా, బీఎల్‌వో యాప్‌కు డెస్క్‌టాప్ వెర్షన్ అందుబాటులో ఉంటే నమోదు ప్రక్రియ మరింత వేగవంతంగా, సమర్థవంతంగా సాగుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పకడ్బందీగా నిర్వహిస్తామని, ప్రతి దశను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని వివరించారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ రవి, ఆర్డీవోలు వెంకన్న, వెంకటేష్, తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, విజయలక్ష్మి ఎన్నికల తహసీల్దార్ జగత్ సింగ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాత అడ్మిట్ కార్డులు చెల్లవు

## - వాట్సాప్ ద్వారా సచారం తెలుసుకునే వీలు

## - నీట్ విద్యార్థులకు ఎన్‌టిఎ కీలక సమాచారం

న్యూఢిల్లీ,జూన్19 (ప్రజా వీక్షణం)

నీట్ అడ్మిట్ కార్డులపై ఎన్‌టీఏ కీలక ప్రకటన చేసింది. అడ్మిట్ కార్డులను ఇప్పటికే డౌన్‌లోడ్ చేసుకున్నవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. కొత్త అడ్మిట్ కార్డులను ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని విద్యార్థుల కోసం ఎన్‌టీఏ నుంచి ఎస్ఎమ్ఎస్, ఈ-మెయిల్, వాట్సాప్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. మే 3 నాటి పాత అడ్మిట్ కార్డులు ఇకపై చెల్లవని స్పష్టం చేసింది. కొత్త అడ్మిట్ కార్డ్‌లను అధికారిక వెబ్‌సైట్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. పలువురు విద్యార్థుల కోరిక మేరకు వారు కోరిన నగరాల్లో కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. నీట్ 2026 అభ్యర్థుల కోసం ఎన్‌టీఏ వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. జూన్ 21 ఆదివారం జరగబోయే నీట్ రీ-ఎగ్జామినేషన్ సమాచారం ఇకపై నేరుగా వాట్సాప్ ద్వారా అభ్యర్థులకు అందనుంది. 91- 78279 80287 నంబర్ నుంచి మాత్రమే అధికారిక సమాచారం వస్తుందని ఎన్‌టీఏ వెల్లడించింది. బ్లూ టిక్ లేని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లను నమ్మవద్దని విద్యార్థులను హెచ్చరించింది.

# జిమ్‌లపై పోలీసుల దాడులు

## శరీరాకృతి కోసం స్టెరాయిడ్స్ వినియోగం

హైదరాబాద్,జూన్19 (ప్రజా వీక్షణం)

నగరంలోని పలు జిమ్‌లపై ఏసీపీ ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇటీవల జిమ్‌లలో వరుసగా యువకులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనల నేపథ్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. శరీరాకృతి కోసం స్టెరాయిడ్లను విచక్షణారహితంగా వాడటం వల్ల తీవ్రమైన గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు హైదరాబాద్‌లోని పలు జిమ్‌లలో వరుసగా తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం కుల్సుంపురా, టప్పాచబుత్ర, గుడిమల్కాపూర్ ప్రాంతాల్లోని జిమ్‌లలో పోలీసుల ముమ్మరంగా సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో శరీరాకృతి కోసం యువత యథేచ్ఛగా స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, మాత్రలు వాడుతున్నట్లు గుర్తించారు. జిమ్‌లలో యువకులను కలిసిన ఏసీపీ.. స్టెరాయిడ్ల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. షార్ట్‌కట్ పద్ధతులను వదిలి, సహజ పద్ధతుల్లోనే ఫిట్‌నెస్ సాధించాలని యువతకు పోలీసులు సూచనలు చేస్తున్నారు.

# హైదరాబాద్‌లో కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ దాడులు

## - ప్రముఖ హోటళ్లలో కుళ్లిన చికెన్ గుర్తింపు

## - పలు రెస్టారెంట్లకు నోటీసులు జారీ

హైదరాబాద్,జూన్19 (ప్రజా వీక్షణం)

నగరంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. హోటల్స్, రెస్టారెంట్లలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 45 ప్రముఖ ఫుడ్ లే అవుట్లు, 8 పన్నీర్ తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. మరో రెండు రోజులపాటు ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు కొనసాగనున్నాయి. ఈ దాడుల్లో రెస్టారెంట్లు, హోటల్స్ కిచెన్స్‌లో అధ్వానమైన పరిస్థితులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జూబ్లీహిల్స్, మాదాపూర్‌లోని ప్రముఖ రెస్టారెంట్లలో రోజుల తరబడి కుళ్లిన చికెన్, పన్నీర్ ఉన్నట్లు సోదాల్లో బయటపడింది. దీంతో దాదాపు 20 రెస్టారెంట్లకు అధికారులు పెనాల్టీలు, నోటీసులు జారీ చేశారు. బేగంబజార్, కాటేదాన్ ప్రాంతాల్లో పన్నీర్ తయారీ కేంద్రాలపై దాడులు చేయగా.. అక్కడి వాతావరణం చూసి అధికారులే షాక్‌కు గురయ్యారు. గంజి పొడి, జంతువుల కొవ్వు ఉపయోగించి పన్నీర్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారుల నేతృత్వంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. పాతబస్తీలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లపై హెచ్ ఫాస్ట్ దాడులు నిర్వహించింది. వాడిన ఆయిల్‌ను పదేపదే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అత్యంత ప్రమాదకర రసాయనాలతో సాస్ తయారుచేసి విక్రయాలు జరుపుతున్నట్లు తేలింది. కుళ్లిన కూరగాయలతో సమోసాలు, ప్రమాదకర స్థితిలో ÷-రెడ్ చికెన్ తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఫాస్ట్‌ఫుడ్ తయారీ గోదామును పోలీసులు మూసివేశారు.

# అనుమానం..పెను భూతమై

## - పసికందును బలి తీసుకున్న తండ్రి

## - భార్యపై అనుమానంతో చిన్నారి హత్య

నిజామాబాద్,జూన్19 (ప్రజా వీక్షణం)

నిజామాబాద్ పట్టణంలో దారుణ ఘటన వెలుగు చూసింది. రెండు నెలల చిన్నారిని కన్నతండ్రే అత్యంత దారుణంగా నరికి చంపడం కలకలం రేపింది. భార్యపై అనుమానంతో పిల్లాడు తనకు పుట్టలేదన్న అనుమానంతో నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడటం కలకలం రేపుతోంది. మహారాష్ట్రలోని నయాగావ్‌కు చెందిన యువరాజ్, నిజామాబాద్‌లోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన ప్రియాంక ఏడాది కిందట వివాహం చేసుకున్నారు. కొన్ని నెలలపాటు వారి బంధం అన్యోన్యంగా సాగింది. ఆ తర్వాత ప్రియాంకపై యువరాజ్ అనుమానం పెంచుకోవడం ప్రారంభించాడు. ప్రియాంకను అనుమానిస్తూ ప్రతిరోజూ వేధించడం మొదలుపెట్టాడు. మరోవైపు ఆమె గర్భం దాల్చడంతో వేధింపులు మరింత పెరిగాయి. ఇటీవల పుట్టింటికి వచ్చిన బాధిత తల్లి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే, చిన్నారి తనకు పుట్టలేదంటూ ప్రియాంక కుటుంబ సభ్యులతో పలుమార్లు యువరాజ్ గొడవకు దిగాడు. ఈ నేపథ్యంలోనే జూన్ 17న బుధవారం చిన్నారిని ఇంటి నుంచి తీసుకెళ్లిపోయాడు. అనంతరం నిర్మానుష్య ప్రదేశంలో బాలుడిని కత్తితో పలుమార్లు నరికి హత్య చేశాడు. ఆ తర్వాత మృతదేహాన్ని రైల్వే పట్టాల పక్కన పడేసి పరారయ్యాడు. సాయంత్రం అయినా భర్త, కుమారుడు ఇంటికి రాకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చిన్నారి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలుడి మృతితో ప్రియాంక, ఆమె కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాం నింపింది. యువరాజ్ కిరాతక చర్యపై పట్టణవాసులు తీవ్రంగా నిరసించారు. కఠినంగా శిక్షించాలని కోరారు.

# ఇంద్రకీలాద్రిపై భక్తులకు మెరుగైన సేవలు

## పరిసరాలను పరిశీలించి, తనిఖీలు చేసిన ఇవో

## భక్తులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా

విజయవాడ,జూన్19 (ప్రజా వీక్షణం)

దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన డిజిటల్ సేవలు అందించడమే లక్ష్యమని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శీనా నాయక్ స్పష్టం చేశారు. శుక్రవారం ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఈవో శీనా నాయక్ విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యాలు, శానిటేషన్, భద్రతపై అధికారులతోపాటు సిబ్బందికి ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. దుర్గా ఘాట్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని వారికి స్పష్టం చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. దుర్గా ఘాట్‌లో 'మన మిత్ర' వాట్సాప్ టికెటింగ్ సేవలను ఈ సందర్భంగా దేవస్థానం ఈవో పరిశీలించారు. కేశఖండనశాలలో సిబ్బంది హాజరు, ఫిర్యాదుల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అలాగే ఆలయంలో అందుతున్న సేవలపై అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో మాట్లాడారు. ఎస్‌బీఐ విరాళంగా ఇచ్చిన సిమెంట్ కుర్చీలపై భక్తుల హర్షం వ్యక్తం చేశారు. కొత్త షెడ్లతోపాటు కూర్చోవడానికి చేసిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి చెందారు. కనకదుర్గ నగర్‌లో హాకర్ల నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను ఈవో శీనా నాయక్ పరిశీలించారు. ప్రసాదం కౌంటర్లలో స్టాక్ నాణ్యతను తనిఖీ చేశారు. మహా మండపంలో కొత్త వాట్సాప్ బుకింగ్ కౌంటర్లను కూడా ఆయన తనిఖీ చేశారు. పాత మెట్ల మార్గంలో భక్తుల సౌకర్యాలను సైతం ఈవో పరిశీలించారు. క్యూ లైన్లలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి సౌకర్యాలను ఈవో పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామని ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ వెల్లడించారు. ఘాట్ రోడ్డులో భక్తుల కోసం 800 ఇనుప కుర్చీలను ఏర్పాటు చేశారు.

# గండిపేట భూకబ్జా కేసు షరతులతో బ్రహ్మానాయుడికి బెయిల్

హైదరాబాద్,జూన్19 (ప్రజా వీక్షణం)

గండిపేట భూకబ్జా కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడికి బెయిల్ మంజూరు అయ్యింది. ఆయనకు రంగారెడ్డి కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ప్రతి 15 రోజులకు ఒకసారి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. రూ.20 వేల చొప్పున రెండు ష్యూరిటీలు సమర్పించాలని రంగారెడ్డి న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో సాక్షులను, విచారణను ప్రభావితం చేసే విధంగా ప్రవర్తించవద్దని షరతుల్లో పేర్కొంది. ఫేక్ జీవో కేసులో ఇప్పటికే ఈవోడబ్ల్యూ పోలీసులు మూడు రోజుల పాటు బొల్లా బ్రహ్మానాయుడిని కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ ముగిసిన తర్వాత ఆయనను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ బొల్లా బ్రహ్మానాయుడు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు ముగిసిన అనంతరం మాజీ ఎమ్మెల్యేకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, కస్టడీలో మాజీ ఎమ్మెల్యే సరైన సమాధానాలు చెప్పలేదని, ఏ ప్రశ్నలు అడిగా తనకు తెలీదని మాత్రమే చెప్పారని, తాము ఆశించిన స్థాయిలో విచారణకు సహకరించలేదంటూ న్యాయస్థానం దృష్టికి పోలీసులు తీసుకెళ్లారు. కస్టడీ పూర్తి అయినందుకు బెయిల్ పొందేందుకు అర్హుడే అంటూ బొల్లా బ్రహ్మానాయుడు తరఫు న్యాయవాదులు వాదించారు. దీంతో మాజీ ఎమ్మెల్యేకు రంగారెడ్డి జిల్లా కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

# నల్లగొండ జిల్లాలో ఘోర ప్రమాదం

## పరసస్రం ఢీకొన్న రెండు కార్లు...ముగ్గురు మృతి

## మృతుల్లో తండ్రీ కొడుకులు

నల్లగొండ,జూన్19 (ప్రజా వీక్షణం)

నల్లగొండ జిల్లాలోని పెద్దవూర మండలం రామన్నగూడెం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. రెండు కార్లు పరస్పరం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో తండ్రీకొడుకులతో పాటు మరొకరు ఉన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన తండ్రీకొడుకులు పల్నాడు జిల్లా ముప్పల్ మండలం కాకర్లపాలెం గ్రామానికి చెందిన కాకర్ల థామస్య(51), ప్రకాష్ రావు (35)గా గుర్తించారు. మరోవ్యక్తి వరంగల్ ఎస్ఎల్‌బీసీ సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సాయికుమార్(20)గా పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురి మృతితో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

# దేశీయ మార్కెట్లో బంగారం ధరలు పతనం

## - పదిగ్రాములపై 3వేలకు పైగా దిగివచ్చిన ధరలు

న్యూఢిల్లీ,జూన్19 (ప్రజా వీక్షణం)

దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు పడిపోవడం వంటి పరిణామాలతో ఈ లోహాలకు డిమాండ్ తగ్గింది. దీంతో వీటి ధరలు కాస్తా తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,49,270గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.3000కు పైనే తగ్గింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.37లక్షలు పలికింది. వెండి ధర ఒక్క రోజే రూ.8,600 తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు దిగొచ్చాయి. ఔన్సు పుత్తడి ధర 4,139 డాలర్లు, ఔన్సు వెండి ధర 63.85 డాలర్లుగా ఉంది. కమొడిటీ ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ. 1.46 లక్షలకు పడిపోయింది. సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.2.30లక్షలుగా కొనసాగుతోంది. అమెరికా–ఇరాన్ యుద్ధం ముగియడం, ఫెడ్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు కోలుకున్నాయి. అటు డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ రూపాయి విలువ కూడా బలపడుతోంది. చమురు ధరలు యుద్ధం మునుపటి స్థితికి దిగొస్తున్నాయి. ఈ కారణాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. అటు దేశీయంగానూ కొనుగోళ్లు తగ్గడం కూడా వీటి ధరల పతనానికి కారణమవుతున్నట్లు పేర్కొంటున్నారు.

# నేటి నుండి రైతులకు అందుబాటులో యూరియా

## - యాప్ ద్వారా రైతులు నమోదు చేసుకోవాలి

## - హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

## - యూరియా ఆన్లైన్ బుకింగ్ యాప్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్





ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 19 (ప్రజా వీక్షణం న్యూస్)

జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి పంటల సాగుకు యూరియా అందు బాటులో ఉందని, యాప్ ద్వారా రైతు లు యూరియా బుకింగ్ చేసుకోవాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో వ్యవసా య సంబంధిత అంశాలపై వ్యవసాయ శాఖ అధికారుల తో కలెక్టర్ సమీక్షా సమావేశా న్ని నిర్వహించారు. ఈ సమా వేశంలో జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో ఒక లక్షా ఎనభై తొమ్మిది వేల యూరి యా బ్యాగులు అందుబాటు లో ఉన్నాయన్నారు. నిల్వ చేసుకోకుండా అవసరాన్ని బట్టి రైతులు యూరియాను కొనుగోలు చేయాలన్నారు. ఇంకా జిల్లాకు పెద్ద ఎత్తున సరిపోను స్టాక్ వస్తుందన్నా రు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో రైతులు వివిధ పంటల సాగు చేపడతారు కాబట్టి అన్నీ మండలాల్లో సరిపోను డీఏపీ, యూరియా నిల్వలు అందుబాటులో ఉండాలన్నారు. యూరియా తీసుకోవడానికి సంబంధిత ఆన్లైన్ యాప్ లో రైతులు సులువుగా నమోదు చేసు కునేలా వ్యవసాయ అధి కారులు అవగాహన కల్పించాలన్నారు. సేల్ పాయింట్ వద్ద యూరియా, ఇతర నిల్వలకు సంబంధిం చిన వివరాలు తెలియజేసే విధంగా రికార్డును నిర్వ హించాలని సూచించారు. రైతు నేస్తం రిపోర్ట్ అంద జేయాలన్నారు. రైతులు రైతు నేస్తం ప్రోగ్రాంకు హాజర య్యే విధంగా చేయాలన్నా రు. రైతు వేదికలలో నెట్వర్క్ సమస్య లేకుండా చూసు కోవాలన్నారు. యూరియా ఆన్లైన్ బుకింగ్ సిస్టమ్ ను జిల్లా కలెక్టర్ చేతుల మీదు గా ప్రారంభించారు. రైతులు ఆన్లైన్ యాప్ ద్వారా యూరి యా బుకింగ్ ఎలా చేస్తారో మొబైల్ ద్వారా తెలియజేశా రు. జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర, ఏడిఏ ఆదిరెడ్డి, సాంకేతిక వ్యవసాయ అధికారి కమలాకర్, 14 మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.


# రాధాగాయత్రి మృతిపై సర్వత్రా అనుమానాలు

## అన్ని చూపులు అల్లుడు శ్రీచరణ్‌పైనే

## పోలీసులకు ఫిర్యాదుతో తదుపరి కార్యాచరణపై ఉత్కంఠ

## పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన గాయత్రి తల్లిదండ్రులు సత్యవతి, సుధాకర్

విశాఖపట్నం,జూన్19 (ప్రజా వీక్షణం)



టెక్కీ రాధాగాయత్రి మృతిపై ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అల్లుడిపైనే తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు ఎలా ముందుకు వెళతారన్నది ఆసక్తిగా మారింది. మరణించింది ఉత్తరాఖండ్‌లో కాబట్టి అక్కడి పోలీసులే దర్యాప్తు చేస్తున్నారు. ఇక్కడ ఫిర్యాదు అంవదడంతో దీనిని బదిలీ చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఇకపోతే ఒక్కగానొక్క కుమార్తె.. ఆ ఇంటి గారాలపట్టి.. రాధాగాయత్రి మహాలక్ష్మిలా పెరిగింది.. భర్తతో విహారయాత్రకు వెళ్లిన ఆమె.. అమ్మానాన్నకు కాల్‌చేసి బుధవారానికల్లా ఇంటి దగ్గర ఉంటానని ఎంతో సంతోషంగా చెప్పింది. అవే ఆమె చివరి మాటలని కన్నవాళ్లు ఊహించలేదు. విగతజీవిగా వచ్చిన కుమార్తెను చూసి శోకసంద్రంలో మునిగిపోయారు. ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన రాధా గాయత్రి మృతదేహాన్ని బుధవారం స్వగ్రామం విజయనగరం జిల్లా జామి మండలం మామిడిపల్లి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తిచేశారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.తమ కూతరు రాధాగాయత్రిది ముమ్మాటికీ హత్యేనని, ఇది అల్లుడి పనేనని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాదూన్ వెళ్లి టెకీ రాధా గాయత్రి అనుమానాస్పద రీతిలో మృతి చెందిన నేపథ్యంలో ఆమె కుటుంబీకులు విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీసీపీ మణికంఠను కలిసిన తల్లిదండ్రులు సత్యవతి, సుధాకర్‌లు గాయత్రి మృతిపై అనుమానాలు వ్యక్తం చేసి న్యాయం చేయాలని కోరారు. మా అమ్మాయిలా ఎవరికీ జరగకూడదు.. అందుకే పోలీసులను ఆశ్రయించాం' అని పేర్కొన్నారు. 'నేను ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ పొందాను. గాయత్రి మొదటి నుంచి విశాఖలో చదువుకుంది. ఎంబీఏలో విజయనగరం మహారాజా కాలేజీ టాపర్‌గా నిలిచింది. గతేడాది నవంబరు 8న శ్రీచరణ్‌తో అంగరంగ వైభవంగా పెళ్లి చేశాం. మసూరీలో ఈనెల 15న మంచంపై గాయత్రి స్పృహ లేకుండా పడిపోయింది, హార్ట్ బీట్ ఉంది అంటూ అల్లుడు శ్రీచరణ్ ఫోన్ చేశారు. వెంటనే మసూరీకి వచ్చేయాలంటూ ఫ్లైట్ టికెట్స్ బుక్ చేశాడు. మేం చేరుకునే సరికి ఘటనా స్థలం అంతా ఖాళీ చేసి దేహ్రాదూన్‌లో పోస్టు మార్టం కూడా పూర్తి చేశారు. పెళ్ళై ఏడు నెలలకే ఇలా మా అమ్మాయి విగతజీవిగా మారిందన్నారు. అల్లుడు శ్రీచరణ్ చిన్న చిన్న విషయాలను కూడా సీరియస్‌గా తీసుకునేవాడు. మా అమ్మాయి బ్యాగ్‌లో తెలియకుండా ట్రాకర్ పెట్టాడని ఫోన్ చేసి చెప్పింది. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసే సమయంలో ఓ గది అద్దెకు తీసుకుని ఉంచారు. ఎవరు ఆ ఇంటికి వెళ్లినా సీసీ ఫుటేజీలు పరిశీలించేవాడు. ర్యాపిడోలో వచ్చినా.. ఎవరు బైక్‌పై డ్రాప్ చేశారనేది వాచ్‌మెన్‌తో వాకబు చేసేవాడు. అంత అనుమానం ఉన్నప్పుడు పెళ్ళెందుకు చేసుకోవాలని, మా అమ్మాయిన పొట్టన పెట్టుకున్న వాడిని వదలవద్దన్నారు. ఈ నెల 17న గాయత్రి విశాఖ రావాల్సి ఉంది. 20వ తేదీ ఇంట్లో ఓ వేడుక ఉంది. ఆ ఏర్పాట్లను మా అమ్మాయే ప్లాన్ చేసింది' అని తండ్రి సుధాకర్ తెలిపారు. గాయత్రి ఫోన్ కాల్ కంటే ఎక్కువగా వీడియో కాల్ చేసి మాట్లాడేది. నన్ను చూడకుండా ఒక్క క్షణం ఉండదు. 13వ తేదీ తెల్లవారుజామున వీడియో కాల్ చేసి మాట్లాడింది. అత్త, మామ అందరం కలిసి వెళదాం అనుకున్నాం కానీ, కుదరక తను, భర్త ఇద్దరే వెళుతున్నారని చెప్పింది. హరిద్వార్, రుషికేశ్‌కు కూడా వెళుతున్నట్లు తెలిపింది. భర్తతో వెళ్లిందని ధైర్యంగా ఉన్నాం కానీ ఇంత ఘోరం జరుగుతుందని ఊహించలేదన్నారు. 14వ తేదీ ధరించిన డ్రెస్ చూపించడానికి వీడియోకాల్ చేసింది. ఆ రాత్రి ఏం జరిగిందో తెలియదన్నారు. దీంతో ఇప్పుడు కేసును ఎలా ముందుకు తీసుకెళ్తారా అన్నది స్థానికులు ఎదురు చూస్తున్నారు.

# సిఎం చంద్రబాబుతో సాయకృష్ణ తల్లి భేటీ

## - కుటుంబసభ్యులతో కలసి వెళ్లిన విజయలక్ష్మి- సాయికృష్ణ అదృశ్యంపై విచార జరుగుతోందన్న సిఎం

## - ఎంతటి వారినైనా వదలబోమని చంద్రబాబు హామీ

## - కుటుంబానికి అండబగా ఉంటామని భరోసా

అమరావతి,జూన్19 (ప్రజా వీక్షణం)



విజయవాడలోని కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, కుటుంబసభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సాయికృష్ణ కుటుంబసభ్యులు శుక్రవారం కలిశారు. సాయికృష్ణ తల్లితో పాటు ఇతర కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బోడెప్రసాద్ ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం చంద్రబాబును సాయికృష్ణ కుటుంబసభ్యులు కలిశారు. తమకు న్యాయం చేయాలంటూ సాయికృష్ణ తల్లి కోరారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. సాయికృష్ణ అదృశ్యంపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి, దర్యాప్తును వేగవంతం చేశామని వెల్లడించారు. తప్పు చేసినవారు ఎంతటివారైనా ఉపేక్షించబోమని సాయికృష్ణ తల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. తన కుమారుడి అదృశ్యంపై విచారణ జరిపి న్యాయం చేయాలని విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా ఆమెకు సీఎం ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి దర్యాప్తును వేగవంతం చేశామన్నారు. సమగ్ర విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చేస్తామని చెప్పారు. తప్పుచేసింది ఎంతటివారైనా ఉపేక్షించబోమన్నారు. కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయం చేస్తామని సీఎం హామీ ఇవ్వడంపై విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని సీఎం చంద్రబాబుకు చెప్పామని సాయికృష్ణ మేనమామ ముళ్లపూడి నవరంగ్ తెలిపారు. కుటుంబసభ్యులతో సీఎంను కలిసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. సాయికృష్ణ తల్లి బాధను సీఎం చంద్రబాబు అర్థం చేసుకున్నారు. బాధ్యులైన అధికారులను శిక్షిస్తామని ఆయన చెప్పారు. మాలాంటి సామాన్యులకు న్యాయం జరగదని భావించాం. కానీ.. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో న్యాయం జరుగుతుందనే నమ్మకం వచ్చింది. రాజకీయంగా మాకు ఎవరిపైనా ద్వేషం లేదు. న్యాయం చేయాలని మాత్రమే సీఎంను కోరాం. ఇలాంటి అన్యాయం మరో మనిషికి జరగకూడదని నవరంగ్ అన్నారు. సాయికృష్ణపై అనేక కేసులు ఉన్నాయి. ఇటీవల అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే వార్తలు వచ్చాయి. అయితే సాయికృష్ణ మిస్సయ్యాడంటూ పోలీసులు చెబుతున్నారు. పోలీసులే సాయికృష్ణను హతమార్చారని, లాకప్ డెత్ కింద కేసు నమోదు చేయాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. సీఐ నాగరాజును సస్పెండ్ చేయాడంతో పాటు.. ఈ కేసుకు సంబంధించి సీనియర్ ఐపీఎస్ అధికారిని దర్యాప్తు అధికారిగా నియమించింది.




# టీమ్ ఇండియాకు ధోని లాంటి మెంటార్ కావాలి!

భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ లక్ష్యంగా మాజీ పేసర్ ఎస్. శ్రీశాంత్ చేసిన కొన్ని ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రస్తుతం ఉన్న టీమ్ ఇండియా సెటప్‌కు గౌతమ్ గంభీర్ కంటే ఎంఎస్ ధోని లాంటి వ్యక్తి అవసరమని శ్రీశాంత్ అభిప్రాయపడ్డాడు. టీమ్ ఇండియాకు ప్రస్తుతం ఆటగాళ్లు మనస్ఫూర్తిగా గౌరవించే ఒక మార్గదర్శకుడు కావాలని, అంతేగానీ "ఆటగాళ్ల వెనుక మాట్లాడేవాడు" లేదా టీవీల్లో ప్రశంసల కోసం ప్రాకులాడే వ్యక్తి కాదని గంభీర్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించాడు. కాగా, ఈ పూర్తి ఇంటర్వ్యూ ఇంకా విడుదల కావాల్సి ఉంది. ఇటీవల న్యూజిలాండ్, సౌతాఫ్రికా వంటి జట్లతో స్వదేశంలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌ల్లో భారత్ ఎందుకు ఇబ్బంది పడిందనే ప్రశ్న శ్రీశాంత్‌కు ఎదురవగా.. ఆ ప్రశ్నను మధ్యలోనే అడ్డుకుంటూ.. "అప్పుడు కోచ్ ఎవరు?" అని ఎదురుప్రశ్న వేశాడు. ఆటగాళ్ల ఎంపికకు సంబంధించిన సమస్యలపై స్పందిస్తూ.. దీనికంతటికీ గంభీరే కారణమన్నట్లుగా మాట్లాడాడు. "ముందు కోచ్‌ను మార్చండి. భారత్‌కు ఇప్పుడు కావాల్సింది కోచ్ కాదు, ఒక మంచి మెంటార్" అని శ్రీశాంత్ స్పష్టం చేశాడు. ఒక షో సజావుగా సాగడానికి డైరెక్టర్ ఎంత ముఖ్యమో, జట్టుకు కోచ్ కూడా అంతే ముఖ్యమని చెబుతూనే.. తనకు సాధారణంగా కోచ్‌లపై ఎలాంటి వ్యతిరేకత లేదని, కానీ అంతర్జాతీయ జట్లకు సాంప్రదాయ కోచ్‌ల కంటే మెంటార్ల అవసరమే ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డాడు. గంభీర్ అనుసరిస్తున్న కోచింగ్ విధానం ఆటగాళ్లపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతోందని శ్రీశాంత్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఫెయిల్ అయితే జట్టు నుంచి తీసేస్తామనే భయాన్ని కల్పించి, ఆటగాళ్లను ఒక కఠినమైన వ్యవస్థలోకి నెట్టే కోచ్ జట్టుకు అవసరం లేదని అన్నాడు.దీనికి ఉదాహరణగా ఎంఎస్ ధోనిని ప్రస్తావిస్తూ.. ధోని ఎప్పుడూ అలా వ్యవహరించలేదని చెప్పాడు. "జనాలు ఏమైనా చెప్పుకోవచ్చు.. కానీ ధోని ఆలోచనా విధానం, అతను ఆటగాళ్లలో నింపిన ఆత్మవిశ్వాసమే జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాయి" అని శ్రీశాంత్ గుర్తుచేశాడు. భారత్ టీ20 ప్రపంచకప్ గెలవడంలో గంభీర్‌కు మితిమీరిన క్రెడిట్ ఇవ్వడం సరికాదని శ్రీశాంత్ వాదించాడు. "మైదానంలో చెమటోడ్చి ఆడేది ఆటగాళ్లు, కాబట్టి ఆ గుర్తింపు, క్రెడిట్ వారికే దక్కాలి" అని అన్నాడు. ప్రపంచకప్ విజయాన్ని ప్రస్తావిస్తూ.. ఆటగాళ్ల ప్రదర్శనే అక్కడ అత్యంత కీలకమని చెప్పాడు. "ఒకవేళ సంజూ శాంసన్ రాణించకపోయినా, సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ సరిగ్గా చేయకపోయినా, లేదా సమయానికి బౌలింగ్ మార్పులు జరగకపోయినా మనం గెలిచేవాళ్లమా? మైదానంలోకి వచ్చి కోచ్ ఏమైనా నిర్ణయాలు తీసుకున్నాడా?" అంటూ శ్రీశాంత్ ఘాటుగా ప్రశ్నించాడు.2013 స్పాట్ ఫిక్సింగ్‌లో శ్రీశాంత్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ధోని వల్లే శ్రీశాంత్ కెరీర్ నాశనం అయ్యిందంటూ కామెంట్స్ కూడా వినిపించాయి. అయితే ఇప్పుడు శ్రీశాంత్ ధోనిపై ప్రశంసలు కురిపించడం కాస్త విచిత్రంగానే ఉంది.





# డూప్లెసిస్ 46 బంతుల్లోనే సెంచరీ

మేజర్ లీగ్ 2026లో ఫాఫ్ డుప్లెసిస్ తొలి మ్యాచ్‌లోనే విధ్వంసం సృష్టించాడు. సియాటెల్ ఆర్కాస్‌తో జరిగిన మ్యాచ్‌లో టెక్సాస్ తరఫున ఆడిన డూప్లెసిస్ 46 బంతుల్లోనే సెంచరీ చేశాడు. 41 ఏళ్లలో 46 బంతుల్లో సెంచరీ చేసిన ఫాఫ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ మేజర్ లీగ్‌లో ఫాఫ్ 4 సెంచరీలతో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇదే మ్యాచ్‌లో సియాటెల్ ఓపెనర్ టిమ్ సైఫర్ట్ కూడా సెంచరీ చేయడం విశేషం. ఈ మ్యాచ్‌లో టెక్సాస్ ఘన విజయం సాధించింది.ఫాఫ్ డుప్లెసిస్ వావ్ అనిపించే ప్రదర్శన చేశాడు. 41 ఏళ్ల వయస్సులో కేవలం 46 బంతుల్లోనే సెంచరీ బాది తనలో ఇంకా సత్తా ఉంది అనిపించాడు. ఇంటర్నేషనల్ క్రికెట్‌కు ఎప్పుడో గుడ్ బై చెప్పిన డుప్లెసిస్.. టీ20 లీగ్‌లలో మాత్రం కొనసాగుతున్నాడు. ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున చివరిసారిగా ఆడిన ఈ లెజెండ్.. ఐపీఎల్ 2026కు ముందు ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ఇస్తున్నట్లు ప్రకటించాడు. తాజాగా యూఎస్ఏ వేదికగా జరుగుతున్న మేజర్ లీగ్ టీ20లో చెన్నై సూపర్ కింగ్స్‌కి టెక్సాస్ సూపర్ కింగ్స్ తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. టెక్సాస్‌కి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఫాఫ్ డుప్లెసిస్ మేజర్ లీగ్ 2026 తొలి మ్యాచ్‌లోనే సెంచరీ బాది జట్టుకు మరచిపోలేని విజయాన్ని అందించాడు. సియాటెల్ ఆర్కాస్‌తో జరిగిన మ్యాచ్‌లో 221 పరుగుల లక్ష్యాన్ని నాటౌట్‌గా నిలిచి ఛేదించాడు. మేజర్ లీగ్‌లో నాలుగు సెంచరీలు నమోదు చేసిన ఫాఫ్, ఈ లీగ్‌లో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా నిలిచాడు. డల్లాస్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన సియాటెల్ ఆర్కాస్ టెక్సాస్ బౌలర్లను ఉతికారేసింది. న్యూజిలాండ్ స్టార్ హిట్టర్ టిమ్ సైఫర్ట్ బౌండరీల మోత మోగించాడు. 66 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, ఆరు సిక్సర్లతో 104 పరుగులు చేయగా.. షయాన్ జహంగీర్ 47 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 78 పరుగులు బాదాడు. ఆఖర్లో కెప్టెన్ మార్కస్ స్టాయినీస్ 3 బంతుల్లో 13 పరుగులు చేయడంతో సియాటెల్ 20 ఓవర్లలో కేవలం 2 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన రెండో బంతికే వికెట్ కోల్పోయింది. తెలుగు ఆటగాడు సాయితేజ ముక్కమల్ల తాను ఎదుర్కొన్న మొదటి బంతికే డకౌట్ అయ్యాడు. తొలి ఓవర్‌లోనే వికెట్ పడినప్పటికీ ఫాఫ్ డుప్లెసిస్ సియాటెల్ బౌలర్లకు చుక్కలు చూయించాడు. రీలీ రోస్సోతో కలిసి పవర్ ప్లేలోనే 89 పరుగులు రాబట్టాడు. 21 బంతుల్లో 7 ఫోర్లు, రెండు సిక్సర్లతో రోస్సో 49 పరుగులు చేసి అవుటయ్యాడు. ఆ వెంటనే మిలింద్ కుమార్, శుభమ్ రంజనే కూడా అవుటవ్వడంతో 165కే నాలుగు వికెట్లు కోల్పోయింది. వియాన్ ముల్డర్‌తో కలిసి ఫాఫ్ డుప్లెసిస్ మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ని ఫినిష్ చేశాడు. 46 బంతుల్లో సెంచరీ చేసిన ఫాఫ్ 52 బంతుల్లో 9 ఫోర్లు, 7 సిక్సర్లతో 113 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ముల్డర్ కూడా 15 బంతుల్లో మూడు సిక్సర్లతో 31 పరుగులు చేశాడు. దాంతో టెక్సాస్ 18.3 ఓవర్లలోనే 221 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

# 2027 వన్డే ప్రపంచకప్‌లో ఇషాన్ ఖాయం: గవాస్కర్




అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో 125 పరుగులతో చెలరేగిన వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌పై క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ప్రశంసలు కురిపించారు. ప్రస్తుత ఫామ్ చూస్తుంటే వన్డే ప్రపంచకప్ 2027 కోసం ఇషాన్‌కు అప్పుడే దక్షిణాఫ్రికా వీసా దొరికినట్లు అనిపిస్తోందని, అతడిని జట్టు నుంచి తప్పించడం అసాధ్యమని గవాస్కర్ జోస్యం చెప్పారు. ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ సైతం ఇషాన్ బ్యాటింగ్ శైలిని కొనియాడాడు. టీమిండియా వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ .. ఇటీవల దుమ్మురేపుతున్నాడు. ఐపీఎల్ 2025లో అద్భుత ప్రదర్శనతో టీమిండియా తరఫున కమ్‌బ్యాక్ ఇచ్చిన ఈ లెఫ్ట్ హ్యాండర్.. ప్రస్తుతం భారత జట్టులో కీలక ఆటగాడిగా మారిపోయాడు. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారిస్తున్నాడు. తాజాగా అఫ్ఘానిస్థాన్‌తో రెండో వన్డేలో మెరుపు శతకంతో సత్తాచాటాడు. దీంతో జట్టు నుంచి అతడిని తప్పించలేని పరిస్థితి తీసుకొచ్చాడు. ఈ నేపథ్యంలో ఇదే విషయంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ మాట్లాడారు. ఇషాన్ కిషన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ 2027లో తప్పకుండా ఆడతాడని జోస్యం చెప్పారు. నాకు తెలిసి ఇషాన్ కిషన్‌కు ఇప్పటికే దక్షిణాఫ్రికా వీసా (వన్డే ప్రపంచకప్ 2027 కోసం) వచ్చి ఉంటుందని అనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అతడిని జట్టు నుంచి తప్పించాలంటే మరో ఆటగాడు అద్భుతమైన ప్రదర్శన చేయాల్సిందే. టీ20 ఫార్మాట్‌లో ఇషాన్ జట్టుకు ఎంతో కీలకమైన ఆటగాడు. పైగా చక్కగా రాణిస్తున్నాడు. షాట్లు అద్భుతంగా ఆడుతున్నాడు. డిఫెన్స్ కూడా బాగుంది. బంతి షార్ట్‌గా వస్తే.. వెంటనే వెనక్కి జరిగి సిక్సర్లు కొడతాడు. గత ఏడాదిన్నర కాలంలో ఇషాన్ సంపూర్ణ ఆటగాడిగా మారిపోయాడు" అని సునీల్ గవాస్కర్ అన్నారు. మరోవైపు ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ కూడా ఇషాన్ కిషన్.. బ్యాటింగ్‌కు ఫిదా అయిపోయాడు. ఫార్మాట్, ఆడే పొజిషన్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారిస్తున్నాడని చెప్పుకొచ్చాడు. అతడు టీమిండియా తరఫున ఆడుతున్నంత కాలం.. ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నది పట్టించుకోకుండా రన్స్ చేస్తాడని కొనియాడాడు. ముఖ్యంగా ఇషాన్ ఎక్స్‌ట్రా కవర్ మీదుగా కొట్టే షాట్లు తనకు ఎంతో ఇష్టమని గ్రేమ్ స్వాన్ వ్యాఖ్యానించాడు. కాగా అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో ఇషాన్ కిషన్.. 79 బంతుల్లో 125 పరుగులు చేశాడు. హాఫ్ సెంచరీ చేసేందుకు 52 బంతులు తీసుకున్న అతడు.. తర్వాత టాప్ గేర్‌లోకి వచ్చాడు. మరో 19 బంతులకే సెంచరీ మార్కును అందుకుని ఔరా అనిపించాడు.




# కెనడా- ఖతార్ మ్యాచ్‌లో తీవ్ర ఉద్రిక్తత!


## మ్యాచ్‌లో ఆటగాళ్ల మధ్య ఘర్షణ

ఫిఫా వరల్డ్?కప్? 2026లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఖతార్??తో జరిగిన మ్యాచ్?లో కెనడా జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్?లో కెనడా 6–0 తేడాతో ఖతార్?ను చిత్తు చేసింది. అయితే మ్యాచ్ అనంతరం మైదానంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుజట్ల ఆటగాళ్ల గ్రౌండ్?లోనే గొడవకు దిగడంతో అక్కడి ప్రాంతం ఒక్కసారిగా హీటెక్కింది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ఈ ప్రపంచకప్?లో వాంకోవర్ బీసీ ప్లేస్ స్టేడియం వేదికగా తాజాగా కెనడా– ఖతార్ జట్లు తలపడ్డాయి. అయితే మ్యాచ్ ముగిసిన వెంటనే ఇరు జట్ల ఆటగాళ్లు మైదానంలోనే ఘర్షణకు దిగారు. మ్యాచ్ అనంతరం కెనడా హెడ్ కోచ్ జెస్సీ మార్ష్– ఖతార్ మేనేజర్ జూలెన్ లోపెటెగీతో కరచాలనం చేస్తుండగా వాళ్లిద్దరి మధ్య గొడవ మొదలైంది. జూలెన్?తో కెనడా కోచ్ దురుసుగా ప్రవర్తించినట్లు కనిపించింది. ఇది ఖతార్ ఆటగాళ్లకు ఆగ్రహం తెప్పించింది. ఆ తర్వాత ఇరుజట్ల ప్లేయర్లు, సిబ్బంది మైదానంలోనే ఒకరినొకరితో కలపడ్డారు. పరస్పరం నెట్టేసుకున్నారు. వెంటనే భద్రతా సిబ్బంది మైదానంలోకి చేరుకుని ఇరు జట్ల ఆటగాళ్లను విడగొట్టారు. దీంతో అభిమానులు ఆందోళనకు గురయ్యారు. అయితే మ్యాచ్? సమయంలోనే ఈ వివాదం మొదలైంది. ఖతార్ ఆటగాడు అసిమ్ మడిబో, కెనడా మిడ్‌ఫీల్డర్ ఇస్మాయిల్ కోన్‌ను ఆట మధ్యలో గాయపర్చాడు.




# ఐపీఎల్ 2027 షెడ్యూల్ లో మార్పు!?

తీవ్రమైన ఎండలు, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఐపీఎల్ 2027 షెడ్యూల్‌లో కీలక మార్పులు చేయాలని బీసీసీఐ భావిస్తోంది. టోర్నీని రెండు వారాలు ముందే, అంటే మార్చి 10 నుంచి మే 15 మధ్య నిర్వహించేందుకు చర్చలు జరుగుతున్నాయని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. అయితే ఐపీఎల్ మ్యాచ్‌ల సంఖ్యను 74 నుంచి 94కు పెంచే ఆలోచన ప్రస్తుతానికి లేదని, అంతర్జాతీయ ద్వైపాక్షిక సిరీస్‌ల వల్ల రెండు నెలల విండోను విస్తరించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ).. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) షెడ్యూల్‌లో కీలక మార్పు చేయాలని భావిస్తోంది. 2027 సీజన్ నుంచి టోర్నమెంట్‌ను కాస్త ముందుగానే ప్రారంభించాలని యోచిస్తోంది. ఎండలు, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల వల్ల ఆటగాళ్లు, అభిమానులు ఇబ్బంది పడటంతో పాటు.. మ్యాచ్ నిర్వహణ కూడా కష్టంగా మారుతోందని బీసీసీఐ భావిస్తోందట. అందుకే కాస్త ముందుగానే సీజన్ ప్రారంభించాలని యోచిస్తున్నట్లు సమాచారం. సాధారణంగా అయితే మార్చి చివరి నుంచి మే చివరి వరకు ఉండే ఐపీఎల్ షెడ్యూల్ ఉంటుంది. ఐపీఎల్ 2026 షెడ్యూల్ సైతం.. మార్చి 28న మొదలై, మే 31 వరకు కొనసాగింది. దానిని ఇకపై మార్చి 10 నుంచి మే 15 మధ్యకు మార్చేందుకు చర్చలు జరుగుతున్నాయని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు సాగితే 2027 ఐపీఎల్ సీజన్.. మార్చి రెండో వారంలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది.దేశంలోని అనేక ప్రాంతాల్లో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రుతుపవనాల రాకకు ముందు కురిసే వర్షాల కారణంగా ఐపీఎల్‌లో చివరి మ్యాచ్‌లు ప్రభావితం అవుతున్నాయని దేవజిత్ సైకియా పేర్కొన్నారు. "ఈ సంవత్సరం ఐపీఎల్ మార్చి 28న మొదలై మే 31 నాటికి ముగిసింది. అయితే, మే 15 తర్వాత టోర్నమెంట్ చివరి దశలో వర్షాలు పడే లేదా రుతుపవనాల సీజన్ మొదలయ్యే అవకాశం ఉందనే ఆందోళన ఉంది. మరోవైపు, తీవ్రమైన వేడి వాతావరణం ఆటగాళ్లకు గానీ, ప్రేక్షకులకు గానీ అనుకూలంగా ఉండదు. అందుకే టోర్నీని 2 వారాలు ముందే ప్రారంభించాలని బోర్డు భావిస్తోంది. దీనిపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లో చర్చ జరుగుతోంది" అని బీసీసీఐ కార్యదర్శి తెలిపారు."ప్రస్తుతానికైతే ఐపీఎల్‌లో మ్యాచ్‌ల సంఖ్య పెంచడం అనేది సాధ్యం కాదు.





# కెనడా 6-0తో ఖతార్‌పై విజయం

ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో కెనడా దుమ్ముదులిపింది. గ్రూప్–బిలో భాగంగా సొంత గడ్డపై జరిగిన వన్–సైడెడ్ మ్యాచ్‌లో కెనడా జట్టు 6–0 గోల్స్ తేడాతో ఖతార్‌ను చిత్తు చేసింది. ఫిఫా ప్రపంచకప్ సుదీర్ఘ చరిత్రలోనే కెనడా జట్టుకు ఇదే మొట్టమొదటి విజయం కావడం విశేషం. ప్రపంచకప్ మ్యాచ్‌లో ఒక ఆతిథ్య దేశం ఆరు గోల్స్ చేయడం 1978 తర్వాత ఇదే తొలిసారి. ఆ ఏడాది అర్జెంటీనా జట్టు పెరూపై 6–0తో గెలవగా, ఇన్నేళ్ల తర్వాత కెనడా ఆ రికార్డును సమం చేసింది.కెనడా స్టార్ స్ట్రైకర్ జొనాథన్ డేవిడ్ ఈ మ్యాచ్‌లో అదరగొట్టాడు. కెనడా తరఫున ప్రపంచకప్‌లో మొదటి హ్యాట్రిక్ సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. యూరప్, దక్షిణ అమెరికాయేతర దేశాల తరఫున ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ సాధించిన రెండో ఆటగాడిగా డేవిడ్ నిలిచాడు ఇంతకుముందు 1930లో అమెరికాకు చెందిన బెర్ట్ పటేనాడ్ ఈ ఘనత సాధించారు. మ్యాచ్ ఆరంభం నుంచే కెనడా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 16వ నిమిషంలోనే కైల్ లారిన్ గోల్ ఖాతా తెరిచి కెనడాకు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత జొనాథన్ డేవిడ్ తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. కెనడా ఆటగాళ్ల దూకుడుకు తోడు ఖతార్ ఆటగాళ్ల క్రమశిక్షణా రాహిత్యం ఆ జట్టును మరింత దెబ్బతీసింది. మ్యాచ్ ముగిసే సమయానికి ఖతార్ జట్టు కేవలం 9 మంది ఆటగాళ్లతోనే ఆడాల్సి వచ్చింది. మొదటి సగ భాగంలోనే హోమామ్ అల్ అమీన్ రెడ్ కార్డ్ చూసి వెళ్లగా, రెండో సగభాగంలో మరో ఆటగాడు మైదానం వీడాల్సి వచ్చింది.

ప్రజావీక్షణం
దినపత్రిక

# బాలకృష్ణ మూవీలో కాజల్ అగర్వాల్ ఫస్ట్ లుక్ విడుదల చేసిన మూవీ మేకర్స్

నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఎన్‌డికె111' నుంచి మేకర్స్ బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. శుక్రవారం హీరోయిన్ కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ చిత్రంలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో గత కొన్ని వారాలుగా ఈ ప్రాజెక్ట్‌పై నెలకొన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది. తాజాగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కాజల్ సింపుల్ చీరకట్టులో, కళ్లజోడు ధరించి అత్యంత గంభీరంగా కనిపించింది. కార్యాలయ వాతావరణంలో నిలబడి ఉన్న ఆమె లుక్‌లో సీరియస్‌నెస్, పవర్‌ఫుల్ వైబ్ స్పష్టంగా కనిపిస్తోంది. స్టార్ హీరోయిన్‌ను ఇలా డీ-గ్లామర్ లుక్‌లో చూపించడంతో పాత్రపై క్యూరియాసిటీ ఒక్కసారిగా పెరిగింది. పోస్టర్‌తో పాటు చిత్ర బృందం కాజల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ సినిమా ఆమె కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. 'భగవంత్ కేసరి' తర్వాత బాలకృష్ణ, కాజల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రమిది. 'భగవంత్ కేసరి'లో కాజల్ పాత్రకు మంచి పేరు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే 'ఎన్‌బికె111'లో మాత్రం ఆమె పూర్తి స్థాయి కథానాయికగా, కథను మలుపు తిప్పే కీలక పాత్రలో కనిపించనుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్, ఎమోషన్‌ల మేళవింపుగా భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే శరవేగంగా జరుగుతోంది.




# సుమంత్ హీరోగా మహేంద్రగిరి వారాహి

అక్కినేని కంపౌండ్ నుంచి సుమంత్ హీరోగా, ఆధ్యాత్మిక అంశాల నేపథ్యంలో విలక్షణమైన చిత్రాలను తెరకెక్కించే దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కాంబినేషన్‌లో వస్తున్న సరికొత్త చిత్రం 'మహేంద్రగిరి వారాహి'. భక్తి, పురాతన నమ్మకాలు, సైన్స్ అండ్ మిస్టరీ చుట్టూ తిరిగే ఈ ఆధ్యాత్మిక సస్పెన్స్ థ్రిల్లర్ అఫీషియల్ టీజర్ విడుదలైన క్రమంలో సోషల్ మీడియాను ఊపేస్తూ, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. మహేంద్రగిరి కొండల బ్యాక్‌డ్రాప్‌లో, వరాహి మాత దివ్య శక్తి చుట్టూ అల్లిన కథతో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన టీజర్ ఆడియన్స్‌ను సరికొత్త లోకంలోకి తీసుకెళ్లింది. అక్కడ జరిగే కొన్ని అంతుచిక్కని సంఘటనలు, భూగర్భంలో దాగి ఉన్న రహస్యాలు, ప్రకృతి సృష్టించే వింతలు ఈ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఒక తెలియని గంభీరమైన వాతావరణాన్ని, హారర్ ఎలిమెంట్స్‌ని దర్శకుడు పర్‌ఫెక్ట్‌గా ఎలివేట్ చేశారు. విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉండటమే కాకుండా, సినిమా కథలో ఏదో ఒక పెద్ద రహస్యమే దాగి ఉందనే క్యూరియాసిటీని ప్రేక్షకుల్లో బలంగా నాటాయి. ఈ సినిమాకు ప్రముఖ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రాణంగా నిలిచింది. ఆధ్యాత్మిక శ్లోకాలతో పాటు, థ్రిల్లింగ్ సీన్లను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లేలా ఆయన మ్యూజిక్ అందించారు. ప్రతాప్ ఆర్. కృష్ణా సినిమాటోగ్రఫీ మైండ్ బ్లోయింగ్ అనిపించేలా ఉంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు అన్నపూర్ణ స్టూడియోస్ లో శరవేగంగా జరుగుతున్నాయి. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిల్మ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో సుమంత్ సరసన మీనాక్షి గోస్వామి హీరోయిన్‌గా నటిస్తుండగా, మాళవిక నాయర్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ లాంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు.




# పవర్‌ఫుల్ రోల్‌లో సమంత లేడీ ఓరియంటెడ్ మూవీ..మాఇంటి బంగారం

మూడేళ్ల విరామం తర్వాత సమంత చేసిన సినిమా 'మా ఇంటి బంగారం'. దాంతో ఈ సినిమాపై అంచనాలు మొదట్నుంచీ భారీగానే ఉన్నాయి. పైగా 'ఓ బేబీ' తర్వాత నందినీరెడ్డి, సమంత కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినిమాపై ఆసక్తి జనాల్లో మెండుగానే ఉన్నది. ఈ సినిమాలో సమంత తొలిసారి యాక్షన్ రోల్ పోషించారు. ప్రచార చిత్రాలకూ, పాటలకు కూడా మంచి స్పందన రావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రేమ వివాహం చేసుకొని, ఓ సంప్రదాయ కుటుంబంలోకి పెద్ద కోడలుగా ఎంట్రీ ఇస్తుంది స్వర్ణ(సమంత). ఇంట్లోకి వచ్చిన నాటి నుంచి అప్పటికే ఇంట్లో ఉన్న చిన్నకోడలు అనసూయ(శ్రీముఖి)తో పోలుస్తూ అంతా ఆమెను చూస్తుంటారు. అనసూయ ఇంటిని చక్కదిద్దటంలో దిట్ట. కానీ స్వర్ణకు మాత్రం ఆ ఇంటి విషయాలు ఏమీ తెలియవు. కానీ ఎలాగైనా పెద్ద కోడలుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెడుతుంది. దీనికి తన చిన్ననాటి స్నేహితురాలు ఆమెకు సహాయం చేస్తుంటుంది. ఈ విధంగా సరదాగా కథ సాగుతూవుంటుంది. మరోవైపు నక్సలైట్ ముసుగులో దుర్మార్గాలకు తెగబడే నీచుడైన గుల్షన్ దేవయ్య జైల్లో శిక్ష అనుభవిస్తుంటాడు. తనకు అనుచరుడి ద్వారా తన సహ నక్సలైట్ అయిన ఝాన్సీ ఆచూకీ తెలుస్తుంది. ఆ ఝాన్సీనే స్వర్ణగా పేరు మార్చుకొని బతుకుతున్నదని తెలుసుకున్న గుల్షన్ దేవయ్య, ఎలాగైనా ఝాన్సీని దక్కించుకునేందుకు జైలు నుంచి పారిపోయి వస్తాడు.




# తెలంగాణ ఫోక్ సింగర్ నాగదుర్గకు హీరోయిన్ ఛాన్స్

'కాపోళ్ల ఇంటికాడా', 'పేరుగల్ల పెద్దిరెడ్డి', 'దారి పొంటొతుండు' వంటి విలక్షణమైన జానపద గీతాలతో, తన అద్భుతమైన నృత్యంతో యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూస్ సొంతం చేసుకున్న ప్రముఖ ఫోక్ సింగర్, డాన్సర్ నాగదుర్గ టాలీవుడ్‌లో బంపర్ ఆఫర్ కొట్టేసింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తన మార్కు జానపద నృత్యాలతో సెన్సేషన్ సృష్టించిన ఈ తెలంగాణ జానపద కళాకారిణి, ఇప్పుడు ఏకంగా సిల్వర్ స్క్రీన్ పై హీరోయిన్‌గా అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ప్రముఖ క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కి చెందిన 'సుకుమార్ రైటింగ్స్' మరియు సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ కి చెందిన 'బన్నీ వాస్ ప్రొడక్షన్స్' సంయుక్తంగా నిర్మిస్తున్న ఒక క్రేజీ ప్రాజెక్టులో నాగదుర్గకు హీరోయిన్‌గా లక్కీ ఛాన్స్ దక్కింది. ఈ సినిమాలో హీరోగా వైవిధ్యమైన పాత్రలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి నటించబోతున్నాడు. ఈ సినిమాతో వంశీ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇప్పటికే 'కలివి వనం' అనే ఓ విలక్షణమైన చిత్రంలో నటించిన నాగదుర్గ, ఆ తర్వాత తమిళంలోనూ ఓ క్రేజీ ప్రాజెక్ట్ లో నటించింది. ఇప్పుడు టాలీవుడ్ లోని మోస్ట్ సక్సెస్‌ఫుల్ బ్యానర్ల నిర్మాణంలో, ప్రియదర్శి సరసన లీడ్ రోల్ పొంది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. నాగదుర్గ పల్లెటూరి నైపథ్యం, ఆమె సహజ సిద్ధమైన నటన, హావభావాలు ఈ చిత్రానికి ప్రధాన బలం కానున్నాయని తెలుస్తోంది.తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కబోతున్నట్లు సమాచారం.






# ధనుష్ తాజా చిత్రం ఓం

తమిళ స్టార్ నటుడు ధనుష్ 55వ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. డి 55గా తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి 'ఓం అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ, మేకర్స్ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు. దట్టమైన అడవులు, కొండల నడుమ సాగే ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా ఈ గ్లింప్స్ కట్ చేశారు. అమాయక గిరిజనులను సాయుధ బలగాలు చుట్టుముట్టగా, భయంతో ఉన్న వారంతా ఒక్కసారిగా 'అణ్ణా మలైయార్‌కు!' అని నినదించే సీన్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. ఆ వెంటనే వర్షం, పొగమంచు మధ్య చేతిలో తుపాకితో ధనుష్ వయలెంట్ అవతారంలో ఎంట్రీ ఇస్తాడు. తుపాకులు పట్టుకున్న బలగాలతో ఒంటిచేత్తో తలపడే యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. ఈ చిత్రాన్ని మేకర్స్ మల్టీ-పార్ట్ సిరీస్‌గా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో 'ఓం'పై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, టాలెంటెడ్ హీరోయిన్ సాయి పల్లవి, యంగ్ సెన్సేషన్ శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఫస్ట్ స్ట్రయిక్‌లో కేవలం ధనుష్ యాక్షన్ పోర్షన్ మాత్రమే చూపించి, మమ్ముట్టి, సాయి పల్లవి లుక్స్‌ను సస్పెన్స్‌గా ఉంచారు. సాయి పల్లవి ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనుందని టాక్. యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది. వండర్‌బార్ ఫిలింస్, ఆర్‌టేక్ స్టూడియోస్ సంయుక్తంగా భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com